RNI NO .TGTEL/25/A4366

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం :
9959812941-9949356387

PUBLISHED: TELANGANA సంపుటి : 01 సంచిక :19 బుధవారం 24 డిసెంబర్ 2025 ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ పేజీలు: 08 వెల :05/-

## ఉప సర్పంచ్‌ల అధికారాలకు కత్తెర




- ఎన్నికల అనంతరం 24గంటల్లోనే చెక్ పవర్ రద్దు
- రాష్ట్ర ప్రభుత్వ సంచలన నిర్ణయం

3 లో

# ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా

## నెక్నాంపూర్‌లో 23 ఎకరాలకు ఫెన్సింగ్




ఐటీ కేంద్రంగా అత్యంత ఖరీదైన నెక్నాంపూర్ ప్రాంతంలో 23.16 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా సోమవారం కాపాడింది. రూ.2,500 కోట్లకు పైగా విలువ ఉన్న భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసి హైడ్రా బోర్డులను ఏర్పాటు చేసింది. ఈ ఆక్రమణల వెనుక ఉన్న బడాబాబుల కుట్రలను హైడ్రా భగ్నం చేసింది. సామాన్యులను ముందు పెట్టి భూమిని సొంతం చేసుకుని రూ.కోట్లకు పడగలెత్తేందుకు చేసిన ప్రయత్నాలకు చెక్ పెట్టింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం, నెక్నాంపూర్ విలేజ్ సర్వే నంబరు 20లో ఉన్న 23.16 ఎకరాల భూమి ఆక్రమణలకు గురవుతోం దని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా ఈ చర్యలు తీసుకుంది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు.. రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో క్షేత్రస్థాయిలో హైడ్రా లోతైన విచారణ చేపట్టింది. ప్రభుత్వ భూమిగా నిర్ధారించుకున్న తర్వాత ఆక్రమణలను హైడ్రా తొలగించింది. కొన్ని కట్టడాలను ఇప్పటికే నేలమట్టం చేయగా సోమవారం మరి కొన్ని ప్రహరీలతో పాటు షెడ్డులను తొలగించి వెనువెంటనే 23.16 ఎకరాల ప్రభుత్వ భూ మి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. అలాగే ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ హైడ్రా బోర్డులను నెలకొల్పింది.

**బడాబాబుల ఆక్రమణలకు చెక్**

ప్రభుత్వ భూమి ఎక్కడ ఉంటే అక్కడ వాలిపోయి సామాన్యులను ముందుంచి కబ్జాల పర్వాన్ని నడిపించిన బడాబాబుల ఆగడాలకు హైడ్రా చెక్ పెట్టింది. రెవెన్యూ రికార్డుల ప్రకారం పూర్తిగా ప్రభుత్వ భూమి అయినప్పటికీ.. పాకాల పోచయ్య దగ్గర భూమిని కొన్నట్టు మహ్మద్ ఇబ్రహీం తప్పుడు రికార్డులను సృష్టించారు. ఇలా కొన్నామని చెప్పిన భూమికి సంబంధించి పాసు బుక్కులు ఇప్పించాలని కోర్టును ఆశ్రయించాడు. కోర్టు నుంచి వచ్చిన ఆదేశాలతో రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వ భూమిగా నిర్ధారించి ఇదే విషయాన్ని కోర్టుకు తెలియజేశారు. ఎలానూ తన వద్ద కొన్నట్టు మహ్మద్ ఇబ్రహీం నకిలీ రికార్డు సృష్టించడంతో పోచయ్య కుటుంబం హక్కుల కోసం పోరాడడం ఇక్కడ గమనార్హం. ఈ తంతుపై మహ్మద్ ఇబ్రహీం పై రెవెన్యూ అధికారులు నార్సింగ్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

## ఇది ప్రజాపాలన కాదు పక్కా మాఫియా పాలన..

### రేవంత్ సర్కార్ పై కేటీఆర్ ఫైర్



తెలంగాణ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి విమర్శలు గుప్పించారు. తెలంగాణలో నడుస్తోంది ప్రజా పాలన కాదు.. "పక్కా మాఫియా పాలన" అని ఆరోపించారు. నాడు ఎన్నికలకోసం కాళేశ్వరం ప్రాజెక్టు మీద బాంబులు వేశారని, నేడు ఇసుక మాఫియా కోసం ఏకంగా చెక్ డ్యామ్‌ల మీద జెలటిన్ స్టిక్స్‌తో బాంబులు వేస్తున్నారని హాట్ కామెంట్స్ చేశారు. ఈ మేరకు ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ చేసిన కేటీఆర్.. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన వాటర్ మ్యాన్ రాజేంద్ర సింగ్ గారు "ఇది మానవ నిర్మిత విధ్వంసం" అని మొత్తుకుంటున్నా, ఈ 'చిట్టి నాయుడి' ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదన్నారు. డ్రిల్లింగ్ మెషీన్లతో హోల్స్ చేసి, జెలటిన్ స్టిక్స్ పెట్టి పేల్చారని ఆయన సాక్ష్యాలతో సహా నిరూపించారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో బిగ్ ట్విస్ట్

# మాజీ సీఎం కేసీఆర్‌కు నోటీసులు?

- సిట్ దర్యాప్తుకు జెట్ స్పీడ్.. రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ
- ప్రభాకర్ రావు స్టేట్‌మెంట్‌తో కేసుకు కొత్త మలుపు
- ఎఫ్ఎస్ఎల్ డేటాతో అగ్రనేతల దాకా చేరిన విచారణ
- కేసీఆర్, హరీశ్ రావులకు నోటీసులపై చర్చ
- ఎవరి ఆదేశాల మేరకు ట్యాపింగ్? కీలక ప్రశ్నలపై ఫోకస్
- మహేందర్ రెడ్డి, అనిల్ కుమార్ పేర్ల ప్రస్తావన
- రివ్యూ కమిటీ సభ్యుల విచారణలో కీలక వెల్లడనలు
- అసెంబ్లీ తర్వాత రాజకీయ భూకంపానికి సూచనలేనా?

ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలన పరిణామాలు చోటుచేసుకునే దిశగా తెలంగాణ రాజకీయ వర్గాల్లో హాట్ డిస్కషన్ నడుస్తోంది. ఈ కేసులో విచారణను వేగవంతం చేసిన తెలంగాణ ప్రభుత్వం, తొమ్మిది మంది పోలీసు ఉన్నతాధికారులతో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ నేతృత్వంలో జెట్ స్పీడ్‌తో దర్యాప్తును కొనసాగిస్తోంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు ఇచ్చిన కీలక స్టేట్‌మెంట్, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ అందించిన డేటా ఆధారంగా, సిట్ ఇప్పుడు రాజకీయ అగ్రనేతల దాకా వెళ్లే సూచనలు కనిపిస్తున్నాయి. తొలిసారి ఈ కేసులో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావులకు నోటీసులు జారీ చేసే యోచనలో సిట్ ఉన్నట్లు సమాచారం

మిగతా 2 లో



## 'మన తొలివెలుగు' రఘుకు బిగ్ షాక్..

### నోటీసులు ఇచ్చిన ఎన్ఐఏ అధికారులు




ప్రముఖ యూట్యూబ్ ఛానెల్ 'మన తొలి వెలుగు రఘు స్టూడియో'కు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) తాజాగా నోటీసులు జారీ చేసింది. మాజీ మావోయిస్టు నేత కట్టా రామచంద్రా రెడ్డి (వికల్ప్) మృతి చెందిన ప్రాంతానికి వెళ్లి వీడియో షూట్ చేసి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసినందుకు, అదేవిధంగా మాజీ మావోయిస్టు గాదె ఇన్నయ్య అరెస్టుకు...

## క్షయ వ్యాధి నివారణకు టీకా..

### భారత్ బయోటెక్ కీలక ప్రకటన



2 లో

ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ప్రాణాలు బలిగొంటున్న క్షయవ్యాధి నివారణకు భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ మరో ముందడుగు వేసింది. స్పెయిన్‌కు చెందిన బయోఫ్యాబ్రి సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తాజాగా భారత్ బయోటెక్ ప్రకటించింది. ఈ ఒప్పందం ద్వారా MTBVAC అనే కొత్త క్షయవ్యాధి టీకాను భారత్‌లో పూర్తి స్థాయిలో తయారు చేయనున్నారు. MTBVAC టీకా నవజన్మ శిశువులు, యుక్త వయస్కులు, పెద్దలకు రక్షణ కల్పించేలా రూపొందించారు.

## భర్తను ముక్కలు ముక్కలుగా నరికి.. గ్రైండర్‌లో రుబ్బి.. కాలువలో పారేసిన కిరాతక భార్య!



2 లో

ఉత్తరప్రదేశ్‌లోని శంభల్ జిల్లాలో వెలుగుచూసిన ఓ అతి కిరాతక హత్య ఉదంతం సభ్య సమాజాన్ని నివ్వెరపోయేలా చేస్తుంది. కేవలం వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడన్న నెపంతో, రాహుల్ అనే వ్యక్తిని అతని భార్య రూబీ తన ప్రియుడు గౌరవ్‌తో కలిసి నవంబర్ 18న అత్యంత పాశవికంగా హతమార్చింది. కేవలం ప్రాణాలు తీయడంతో ఆగకుండా, మృతదేహాన్ని ముక్కలు ముక్కలుగా నరికి, ఆ మాంసాన్ని గ్రైండర్‌లో వేసి రుబ్బి కాల్వలో పారేయడం నిందితుల వికృత మనస్తత్వానికి అద్దం పడుతోంది. నేరం చేసిన తర్వాత ఏమీ తెలియనట్టు భర్త కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసిన రూబీ.. చివరికి భర్త చేతిపై ఉన్న 'టాటూ' రూపంలో దొరికిపోయింది.

ఈ ఘటన గతంలో దేశాన్ని ఉలిక్కిపడేలా చేసిన 'శ్రద్ధా వాకర్', 'అంజన్ దాస్' హత్యోదంతాలను గుర్తుకు తెస్తోంది. ఢిల్లీలో శ్రద్ధా వాకర్‌ను ఆమె ప్రియుడు అఫ్తాబ్ 35 ముక్కలుగా నరికి ఫ్రిజ్‌లో దాచిన ఘటన, అలాగే పాండవ్ నగర్‌లో భర్తను చంపి ముక్కలుగా కోసి పారేసిన భార్య ఉదంతం తరహాలోనే ఈ 'శంభల్' కేసు సాగింది.

## ఆరావళి పర్వాతాలపై 'సుప్రీం' కీలక తీర్పు

### 100 మీటర్ల లోపు ఎత్తున్న కొండలకు మైనింగ్ నుంచి విముక్తి?


2 లో

దేశంలోని అతి పురాతన పర్వత శ్రేణులైన ఆరావళి కొండల రక్షణ, అక్కడ సాగే మైనింగ్ ప్రక్రియ పై సుప్రీం కోర్టు సంచలన తీర్పునిచ్చింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఆరావళి కొండల కొత్త నిర్వచనాన్ని అత్యున్నత న్యాయస్థానం ఆమోదించింది. ఈ కొత్త నిబంధన ప్రకారం, స్థానిక భూతలం నుండి 100 మీటర్ల కంటే తక్కువ ఎత్తు ఉన్న గుట్టలను 'కఠినమైన మైనింగ్ నిబంధనల' పరిధిలోకి తీసుకు రావాల్సిన అవసరం లేదని కోర్టు స్పష్టం చేసింది. అంటే, ఈ పరిమితి కంటే తక్కువ ఎత్తున్న ప్రాంతాల్లో మైనింగ్ కార్యకలాపాలకు కొంత వెసులుబాటు లభించే అవకాశం ఉంది. అయితే, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని కోర్టు మరికొన్ని కీలక ఆదేశాలు జారీ చేసింది.

శాస్త్రీయ మైనింగ్: ఆరావళి ప్రాంతంలో మైనింగ్ పద్ధతులు పర్యావరణానికి హాని కలిగించకుండా 'సుస్థిరంగా' ఉండాలని, దీని కోసం కేంద్రం రూపొందించిన మార్గదర్శకాలను పాటించాలని ఆదేశించింది. అలాగే అక్రమ మైనింగ్‌ను అరికట్టేందుకు డ్రోన్ విజువల్స్, శాటిలైట్ చిత్రాల వంటి అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించాలని సూచించింది.

## తెలంగాణ సర్కార్ మరో షాకింగ్ నిర్ణయం

### ఇక నామినేటెడ్ పాలకమండళ్లుగా సహకార సంఘాలు



2 లో

## మహిళలకు గుడ్ న్యూస్..

### ఆ పథకం కింద విజయ డెయిరీ పార్లర్ల కేటాయింపులు



2 లో

## దీపు చంద్ర దాస్ హత్యపై ఢిల్లీలో నిరసనలు

### బంగ్లాదేశ్ హైకమిషన్ ముట్టడికి విహెచ్‌పి యత్నం


2 లో

## ఒకే కుటుంబంలో నలుగురు మృతి..

### మృతుల్లో ఇద్దరు పిల్లలు


2 లో

## విజయోత్సవ ర్యాలీలో తీవ్ర విషాదం..

### ఏడేళ్ల చిన్నారి పైనుంచి వెళ్లిన సర్పంచ్ కారు


2 లో

## దక్షిణాదిలో 'మద్యం' పరుగులు..

### లిక్కర్ వినియోగంలో తెలంగాణ టాప్


2 లో

## 'నవ వధూవరులకు శ్రీవారి ఆశీస్సులు'.. టీటీడీ కీలక ప్రకటన


2 లో

## మహిళలకు గుడ్ న్యూస్.. ఆ పథకం కింద విజయ డెయిరీ పార్లర్ల కేటాయింపులు

తెలంగాణ ప్రభుత్వం మహిళలకు మరో గుడ్‌న్యూస్ చెప్పనుంది. మహిళా సంఘాల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా ఇందిరా మహిళా శక్తి పథకం కింద విజయ డెయిరీ పార్లర్లను కేటాయించేందుకు సిద్ధమైంది. మండలానికి ఒకటి చొప్పున, మున్సిపాలిటీల్లో రెండు చొప్పున మహిళా సంఘాలకు పార్లర్లు కేటాయించేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. దీనిపై వారం, పది రోజుల్లో విధివిధానాలను ఖరారు చేయనున్నారు. పార్లర్ కోసం మహిళా సంఘాలు పారిశ్రామికాభివృద్ధి సహకార సమాఖ్యకు రూ.1,000 చెల్లించి దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా, స్థలం ఏర్పాటు అనంతరం రూ.5,000 చెల్లిస్తే పార్లర్ మంజూరు చేస్తారు. ఒక్కో పార్లర్ ఏర్పాటుకు సుమారు రూ.5 లక్షల వరకు ఖర్చు అవుతుండగా, దీనికోసం ప్రభుత్వం రుణాలను సైతం అందించనుంది. అయితే ఈ పార్లర్లలో విజయ డెయిరీ ఉత్పత్తులైన పాలు, పెరుగు, పన్నీర్, వాటర్ బాటిళ్లు మాత్రమే అమ్మాల్సి ఉంటుంది. తద్వారా వచ్చే ఆదాయం మహిళల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

## ఒకే కుటుంబంలో నలుగురు మృతి.. మృతుల్లో ఇద్దరు పిల్లలు

ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వారి ఇంట్లో ప్రాణాలు కోల్పోయి కనిపించడం కలకలం గా మారింది. ఈ షాకింగ్ ఘటన కేరళలోని కన్నూర్ జిల్లా రామంతలి లో చోటు చేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు తమ నివాసంలో విగతజీవులుగా పడి ఉండటం, మృతుల్లో 38 ఏళ్ల వ్యక్తి, అతని 60 ఏళ్ల తల్లితో పాటు ఐదేళ్లు, రెండేళ్ల వయసున్న ఇద్దరు చిన్న పిల్లలు ఉండటం దిగ్భ్రాంతికి గురి చేస్తుంది. సోమవారం రాత్రి సమయంలో వీరి మృతదేహాలను పోలీసులు గుర్తించారు.

ఈ హృదయవిదారక ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం, 38 ఏళ్ల వ్యక్తి, అతని తల్లి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా కనిపిస్తుండగా, ఇద్దరు పసిపిల్లల మృతదేహాలు నేలపై పడి ఉన్నాయి. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు ఈ అఘాయిత్యానికి కారణమై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు, మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించి అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు.

## ఇది ప్రజాపాలన కాదు పక్కా మాఫియా పాలన.. రేవంత్ సర్కార్ పై కేటీఆర్ ఫైర్

మొదటి పేజీ తరువాయి

ఇసుకను దోచుకోవడానికి అడ్డుగా ఉన్నాయని, కోట్ల రూపాయల ప్రజా ధనంతో కట్టిన చెక్ డ్యామ్‌లను డైనమైట్లు పెట్టి పేల్చేస్తారా? ఇది ప్రభుత్వమా లేక గ్యాంగ్ స్టర్ల అడ్డాయా? అని నిలదీశారు.

భూగర్భ జలాలు పెరగాలని తమ ప్రభుత్వంచెక్ డ్యామ్‌లు కడితే.. వాటిని కూల్చివేసి రైతుల పొలాలను ఎడారిగా మారుస్తున్నారని మీ ఇసుక కాంట్రాక్టర్ల లాభాల కోసం తెలంగాణ రైతాంగం బలి కావాలా? అని ప్రశ్నించారు. ప్రకృతి వైపరీత్యం వల్ల కూలిపోయాయని కట్టుకథలు అల్లిన కాంగ్రెస్ మంత్రులకు రాజేంద్ర సింగ్ రిపోర్ట్ చెంపపెట్టు అని ఇప్పుడు మీ సమాధానం ఏంటి రేవంత్ రెడ్డి? అని ప్రశ్నించారు. అభివృద్ధి చేయడం చేతకాదు కానీ, ఉన్న ఆస్తులను కూల్చడంలో మీరు సిద్ధహస్తులు. తెలంగాణ ఆస్తులపై బాంబులు వేస్తున్న మాఫియా వెనుక ఉన్న అసలు దొంగలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. రాజేంద్ర సింగ్ డిమాండ్ చేసినట్లు పీపుల్స్ ఎంక్వైరీ కమిషన్ వేయాల్సిందేనని లేదంటే ఈ బాంబుల సెగ మీ కుర్చీ దాకా రావడం ఖాయం అని హెచ్చరించారు.

## విజయోత్సవ ర్యాలీలో తీవ్ర విషాదం.. ఏడేళ్ల చిన్నారి పైనుంచి వెళ్లిన సర్పంచ్ కారు

సర్పంచ్ విజయోత్సవ ర్యాలీలో తీవ్ర విషాదం చోటుచేసుకున్న ఘటన వికారాబాద్ జిల్లాలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పూడూరు మండల పరిధిలోని రాకంచర్ల గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా కమ్లిబాయ్ విజయం సాధించింది. దీంతో ఆమె అనుచరులు, మద్దతుదారులు సోమవారం రాత్రి పోలీసుల నుంచి ఎలాంటి అనుమతి లేకుండా భారీ డీజే సౌండ్‌తో విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. ఈ క్రమంలోనే సర్పంచ్ కారు 7 ఏళ్ల చిన్నారి కుర్వా సౌజన్యపైకి ఎక్కేసింది. ఈ దుర్ఘటనలో సౌజన్యకు తీవ్ర గాయాలు కాగా.. అక్కడున్న వారు సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోయింది. దీంతో ఆస్పత్రి ఎదుట బాధిత కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగగా.. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిస్థితిని సద్దుమణిగేలా చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు.

## దక్షిణాదిలో 'మద్యం' పరుగులు.. లిక్కర్ వినియోగంలో తెలంగాణ టాప్

దక్షిణ భారతదేశంలో మద్యం వినియోగం, దాని ద్వారా వచ్చే ఆదాయం భారీగా పెరిగిపోతున్నాయి. ఈ మద్యం ఆదాయంలో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ, ఎక్సైజ్ శాఖ నివేదికల ప్రకారం, తెలంగాణలో ఏడాదికి సగటు తలసరి ఆల్కహాల్ వినియోగం 4.44 లీటర్లుగా నమోదైంది. ఈ జాబితాలో తెలంగాణ తర్వాత కర్ణాటక (4.25 లీటర్లు), తమిళనాడు (3.38 లీటర్లు) ఉండగా, ఆంధ్రప్రదేశ్ (2.71 లీటర్లు), కేరళ (2.53 లీటర్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ముఖ్యంగా తెలంగాణలో పట్టణ ప్రాంతాల కంటే గ్రామీణ ప్రాంతాల్లోనే మద్యం వినియోగం ఎక్కువగా ఉండటం, అందులోనూ బీర్ల వాడకం రికార్డు స్థాయిలో ఉండటం గమనార్హం.

మద్యం కోసం ప్రజలు వెచ్చిస్తున్న సొమ్ము విషయంలో కూడా తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. ఇక్కడ ఒక్కొక్కరు ఏడాదికి సగటున రూ. 11,351 మద్యాన్ని కొనుగోలు చేసేందుకు ఖర్చు చేస్తున్నారు. అదే ఆంధ్రప్రదేశ్‌లో ఈ ఖర్చు కేవలం రూ. 6,399 గా మాత్రమే ఉంది. ఈ విక్రయాల ద్వారా తెలంగాణ ప్రభుత్వానికి ఏటా రూ. 36,000 కోట్ల పైచిలుకు ఆదాయం సమకూరుతుందని అంచనా. అయితే, పెరుగుతున్న ఈ వ్యసనం వల్ల ప్రజల ఆరోగ్యం, ఆర్థిక పరిస్థితి దెబ్బతింటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏపీలో గత కొంతకాలంగా మారుతున్న మద్యం విధానాల వల్ల ఇతర రాష్ట్రాలతో పోలిస్తే వినియోగం గణనీయంగా తక్కువగా ఉందని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

## భర్తను ముక్కలు ముక్కలుగా నరికి.. గ్రైండర్‌లో రుబ్బి.. కాలువలో పారేసిన కిరాతక భార్య!

మొదటి పేజీ తరువాయి



టెక్నాలజీ మరియు ఆధునిక దర్యాప్తు పద్ధతులు అందుబాటులో ఉన్నా, నేరాన్ని కప్పిపుచ్చుకోవడానికి నిందితులు ఇలాంటి అత్యంత కిరాతక మార్గాలను ఎంచుకోవడం ఆందోళన కలిగిస్తోంది.

ప్రేమ, పెళ్లి వంటి పవిత్ర బంధాలను కాలరాస్తూ కేవలం క్షణిక వాంఛల కోసం కన్నవారిని, కట్టుకున్న వారిని కడతేరుస్తున్న ఇటువంటి ఘటనలు సమాజంలో నైతిక విలువల పతనాన్ని సూచిస్తున్నాయి. గతంలో జరిగిన ఇలాంటి కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడినప్పటికీ, నేరస్తుల్లో మార్పు రాకపోవడం గమనార్హం. ప్రస్తుతం పోలీసులు రూబీ, ఆమె ప్రియుడు గౌరవ్‌ను అరెస్ట్ చేసి కఠిన విచారణ జరుపుతున్నారు. ఈ కేసులో త్వరలోనే మరిన్ని భయంకరమైన నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో బిగ్ ట్విస్ట్.. మాజీ సీఎం కేసీఆర్‌కు నోటీసులు?

మొదటి పేజీ తరువాయి

ఫోన్ ట్యాపింగ్ ఎవరి కోసం జరిగింది? ఎవరి ఆదేశాల మేరకు వేల సంఖ్యలో ఫోన్లను నిఘాలో పెట్టారు? అన్న కీలక ప్రశ్నల చుట్టూ సిట్ దర్యాప్తు తిరుగుతోంది. ఈ క్రమంలో ప్రభాకర్ రావు ఎంక్వైరీలో పదేపదే అప్పటి డీజీపీ మహేందర్ రెడ్డి, అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్ అనిల్ కుమార్ పేర్లను ప్రస్తావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే మహేందర్ రెడ్డి స్టేట్‌మెంట్‌ను సిట్ అధికారులు రికార్డు చేయగా, ఆయన ఇచ్చిన వివరాలు మరింత కీలకంగా మారినట్లు సమాచారం.

ఫోన్ ట్యాపింగ్ రివ్యూ కమిటీలో సభ్యులుగా ఉన్న మాజీ సీఎస్‌లు సోమేష్ కుమార్, శాంతికుమారి, అలాగే ఇతర ఉన్నతాధికారులు తిరుపతి, శేషాద్రిలను సిట్ ఇప్పటికే విచారించింది. వారి విచారణలో, ప్రభాకర్ రావు వేల సంఖ్యలో ఫోన్ నంబర్ల జాబితాను తమకు అందించారని, అయితే ఆయనపై ఉన్న నమ్మకంతో అవి మావోయిస్టులు, ఉగ్రవాదులు లేదా సంఘవిరోధక శక్తులకు సంబంధించినవని భావించి పూర్తిగా వెరిఫై చేయలేకపోయామని వారు సమాధానమిచ్చినట్లు సమాచారం.

ఈ కేసులో కీలకంగా మారింది ఎఫ్ఎస్ఎల్ రిపోర్టు. ఓ ప్రముఖ న్యూస్ ఛానల్ ఎండీ శ్రవణ్ రావు, మాజీ డీఎస్పీ ప్రణీత్ రావు మధ్య జరిగిన సంభాషణలను ఎఫ్ఎస్ఎల్ విజయవంతంగా రీట్రీవ్ చేసింది. ప్రస్తుతం అదే డేటాను ఆధారంగా చేసుకుని సిట్ అధికారులు తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నారు. ఈ డేటా ఆధారంగానే మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావులకు నోటీసులు ఇవ్వాలన్న ఆలోచనపై సిట్ కసరత్తు చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

అసెంబ్లీ సమావేశాలు ముగిసిన అనంతరం ఫోన్ ట్యాపింగ్ కేసులో ఊహించని పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం. రాజకీయంగా ఈ కేసు ఎటు దారి తీస్తుందోనన్న ఉత్కంఠతో పాటు, తెలంగాణ రాజకీయాల్లో ఇది పెద్ద భూకంపం సృష్టించే ఛాన్స్ ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఫోన్ ట్యాపింగ్ కేసు ఇప్పుడు కేవలం పోలీసు దర్యాప్తు పరిమితిని దాటి, రాష్ట్ర రాజకీయాలను కుదిపే అంశంగా మారడం ఖాయమన్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

## 'నవ వధూవరులకు శ్రీవారి ఆశీస్సులు'.. టీటీడీ కీలక ప్రకటన

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారి దర్శనానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు. కుటుంబ సమేతంగా తిరుమల ఆలయానికి చేరుకుని.. భక్తి శ్రద్ధలతో శ్రీవారి సేవలో పాల్గొంటారు. ఈ క్రమంలో తాజాగా టీటీడీ శ్రీవారి భక్తులకు కీలక ప్రకటన చేసింది. నూతనంగా వివాహం చేసుకునే పెళ్లి కుమార్తె, పెళ్లి కుమారుడికి శ్రీవారి దీవెనలతో అక్షింతలు, కుంకుమ, కంకణం, శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీపద్మావతీ అమ్మవారి ఫొటోలతో కూడిన ఆశీర్వచనం పత్రిక, 'కల్యాణ సంస్కృతి' పుస్తకం టీటీడీ అందిస్తోంది. ప్రతి ఏడాది శుభలేఖ పంపిన లక్షకు పైగా వధువరులకు శ్రీవారి దీవెనలతో కల్యాణం జరుగుతోంది.

నూతన వధూవరులు కోటి ఆశలతో కొత్త జీవితాన్ని ప్రారంభిస్తారు. ఇంతటి విశిష్టమైన వివాహానికి కలియుగ వైకుంఠం శ్రీవేంకటేశ్వరుని ఆశీస్సులు అందితే అంతకన్నా కావాల్సిందేముంది. ఈ మహత్తర అవకాశాన్ని టీటీడీ భక్తులకు కల్పిస్తోంది. తిరుపతిలోని టిటిడి పరిపాలన భవనంలో గల శుద్ధ ప్రతి విభాగం (తపాలా విభాగం) సిబ్బంది నిరంతరం శ్రమిస్తూ ప్రతి సంవత్సరం లక్షకు పైగా నూతన జంటలకు శ్రీవారి అశీస్సులు అందిస్తున్నారు. ఇందుకు చేయాల్సింది పూర్తి చిరునామాతో వివాహ శుభలేఖను పంపాలి. నూతన వధూవరులు తమ పూర్తి చిరునామాతో "కార్యనిర్వహణాధికారి, టిటిడి పరిపాలన భవనం, కె.టి.రోడ్డు, తిరుపతి – 517501" పేరిట వివాహ పత్రికను పంపాలి. మరిన్ని వివరాలకు కాల్ సెంటర్ నెం.155257 సంప్రదించగలరని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

## ఆరావళి పర్వాతాలపై 'సుప్రీం' కీలక తీర్పు.. 100 మీటర్ల లోపు ఎత్తున్న కొండలకు మైనింగ్ నుంచి విముక్తి?

మొదటి పేజీ తరువాయి

రెండు లేదా అంతకంటే ఎక్కువ కొండలు 500 మీటర్ల పరిధిలో ఉంటే వాటిని 'ఆరావళి శ్రేణి'గా పరిగణించాలని, అప్పుడు ఎత్తుతో సంబంధం లేకుండా వాటి రక్షణ బాధ్యత తీసుకోవాలని కోర్టు పేర్కొంది.

పర్యావరణవేత్తల ఆందోళన

సుప్రీంకోర్టు తీర్పుపై పర్యావరణ ప్రేమికులు కొంత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరావళి శ్రేణిలో దాదాపు 90 శాతం గుట్టలు 100 మీటర్ల కంటే తక్కువ ఎత్తులోనే ఉన్నాయని, తాజా నిర్వచనం వల్ల ఆ ప్రాంతాలన్నీ మైనింగ్ మాఫియా చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. థార్ ఎడారి విస్తరించకుండా అడ్డుకుంటున్న ఈ కొండలు కనుమరుగైతే ఉత్తర భారతం తీవ్ర పర్యావరణ సంక్షోభంలో పడుతుందని వారు వాదిస్తున్నారు.

హర్యానాలోని గురుగ్రామ్ నుండి రాజస్థాన్‌లోని ఉదయపూర్ వరకు పర్యావరణ ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతున్నారు. "ఆరావళి లేకపోతే జీవం లేదు" అంటూ ప్లకార్డులతో రోడ్లపైకి వచ్చి, ఈ కొత్త నిర్వచనాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం మాత్రం 90 శాతం ప్రాంతం సురక్షితంగానే ఉంటుందని చెప్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో చిన్న చిన్న గుట్టలు కనుమరుగైతే భూగర్భ జలాలు అడుగంటిపోతాయని, వన్యప్రాణుల ఆవాసాలు దెబ్బతింటాయని ఉద్యమకారులు గట్టిగా వాదిస్తున్నారు.

## బీజేపీ భారత రాజ్యాంగాన్ని అంతం చేయాలని చూస్తోంది: రాహుల్ గాంధీ




జర్మనీ పర్యటనలో ఉన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బెర్లిన్‌లోని హెర్టీ స్కూల్‌లో జరిగిన ముఖాముఖిలో ఆయన మాట్లాడుతూ.. దేశంలోని అన్ని వర్గాలకు సమాన హక్కులు కల్పించే భారత రాజ్యాంగాన్ని అంతం చేసేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని సంచలన ఆరోపణలు చేశారు. భారతదేశం వంటి అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం ప్రపంచానికే ఒక గొప్ప ఆస్తి అని, అయితే ప్రస్తుతం దేశంలోని రాజ్యాంగ వ్యవస్థలను బీజేపీ తన గుప్పిట్లోకి పెట్టుకుని రాజకీయ స్వార్థానికి వాడుకుంటోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

కేవలం దేశంలోని వ్యవస్థలనే కాకుండా, "ఒక వ్యక్తి – ఒక ఓటు" అనే ప్రాథమిక సూత్రాన్ని కూడా దెబ్బతీసేలా బీజేపీ అడుగులు వేస్తోందని, దీనిని అడ్డుకోవడమే విపక్షాల ప్రధాన లక్ష్యమని రాహుల్ స్పష్టం చేశారు. తయారీ రంగంలో భారత్ వెనుకబడటం వల్ల నిరుద్యోగం పెరుగుతోందని, ప్రస్తుతం భారత్‌లో ప్రజాస్వామ్యంపై జరుగుతున్న ఈ దాడులు అంతర్జాతీయ ప్రజాస్వామ్య వ్యవస్థలకే ప్రమాదకరమని ఆయన ఈ సందర్భంగా రాహుల్ గాంధీ హెచ్చరించారు. కాగా మరోసారి విదేశాల వేదికగా రాహుల్ గాంధీ.. భారత్ ను తక్కువ చేసి మాట్లాడటం పై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

## 'మన తొలివెలుగు' రఘుకు బిగ్ షాక్.. నోటీసులు ఇచ్చిన ఎన్ఐఏ అధికారులు

మొదటి పేజీ తరువాయి

కారణాలపై మరో వీడియో అప్‌లోడ్ చేసినందుకు గాను ఆయనకు నోటీసులు ఇచ్చినట్లుగా తెలుస్తోంది. ఈ మేరకు ఇవాళ గచ్చిబౌలి ఎన్ఐఏ కార్యాలయానికి వచ్చిన వివరణ ఇవ్వాలని మన తొలివెలుగు రఘుకు ఇచ్చిన నోటీసులలో స్పష్టంగా పేర్కొన్నారు.

కాగా, గతంలో సీపీఐ (మావోయిస్ట్) సెంట్రల్ కమిటీ సభ్యుడు కట్టా రామచంద్రా రెడ్డి ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్‌లో మరణించిన విషయం తెలిసిందే. ఆ ఘటనతో పాటు, మాజీ మావోయిస్టు గాదె ఇన్నారెడ్డిని ఎన్ఐఏ ఇటీవల అరెస్టు చేసింది. మావోయిస్టులకు మద్దతుగా ప్రసంగించిన ఆరోపణలపై ఆయనపై యూఏపీఏ చట్టం కింద కేసు నమోదైంది. ఈ క్రమంలోనే 'మన తొలి వెలుగు రఘు స్టూడియో' అప్‌లోడ్ చేసిన వీడియోలు ఎన్ఐఏ దృష్టికి వచ్చాయి. దీంతో ఆ ఛానెల్ బృందం సదరు వీడియోలపై వివరణ ఇవ్వాలని తాజాగా అధికారులు నోటీసులు జారీ చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

## క్షయ వ్యాధి నివారణకు టీకా.. భారత్ బయోటెక్ కీలక ప్రకటన

మొదటి పేజీ తరువాయి

ప్రస్తుతం ఉన్న బీసీజీ టీకా కంటే ఎక్కువ సమర్థవంతంగా, ఎక్కువ కాలం రక్షణ ఇచ్చే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ టీకా మానవ మూలం నుంచి తీసుకున్న జీవించి బలహీనపరచబడిన మైకోబాక్టీరియం ట్యూబర్క్యులోసిస్ ఆధారంగా అభివృద్ధి చేశారు.

భారత్ బయోటెక్, బయోఫ్యాబ్రి మధ్య మూడేళ్లుగా సహకారం కొనసాగుతోంది. ఇప్పటికే భారత్‌లో ఫేజ్–1 మరియు ఫేజ్–2 క్లినికల్ ట్రయల్స్ విజయవంతంగా పూర్తయ్యాయి. టీకా సురక్షితమని, రోగనిరోధక శక్తిని పెంచుతుందని ఫలితాలు నిరూపించాయి. దీంతో, మూడో దశ (ఫేజ్–3) సమర్థత పరీక్షలకు సన్నాహాలు జరుగుతున్నాయి. 2026 ప్రారంభంలో ఈ పరీక్షలు ప్రారంభమవుతాయని భారత్ బయోటెక్ తెలిపింది. ఈ ఒప్పందం ప్రకారం, ఆఫ్రికా మరియు ఆగ్నేయాసియాలోని 70కి పైగా దేశాల్లో MTBVAC టీకా ఉత్పత్తి మరియు సరఫరాకు భారత్ బయోటెక్ బాధ్యత వహిస్తుంది. ఈ ప్రాంతాలు క్షయవ్యాధి బారిన ఎక్కువగా పడుతున్నవి. ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాలకు అనుగుణంగా సమాన అవకాశాలతో టీకా అందుబాటులోకి తెచ్చేందుకు ఈ భాగస్వామ్యం కీలకమని భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ కృష్ణ ఎల్లా పేర్కొన్నారు.

## తెలంగాణ సర్కార్ మరో షాకింగ్ నిర్ణయం

### ఇక నామినేటెడ్ పాలకమండళ్లుగా సహకార సంఘాలు

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (PACS), జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల (DCCB) ఎన్నికైన పాలకవర్గాలను రద్దు చేస్తూ ఈనెల 19న అధికారిక ఉత్తర్వులు విడుదలైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే తెలంగాణ సర్కార్మరో కీలక నిర్ణయం తీసుకున్నది. ఇకపై నామినేటెడ్ పాలక మండళ్లుగా సహకార సంఘాల పాలకవర్గాలు ఏర్పాటు కానున్నాయి. ప్రస్తుతం వ్యవసాయ మార్కెట్ కమిటీల తరహాలో నియామకాలు జరగనున్నాయి. రాబోయే సంక్రాంతి లోపు పాలకవర్గాల ఏర్పాటు లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. ప్రతి పీఏసీఎస్‌కు 13 మందితో పాలకవర్గాలు ఏర్పాటు కానున్నాయి. అందులో చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు 11 మంది డైరెక్టర్లు ఉంటారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మూడు డైరెక్టర్ పోస్టులు ఇవ్వనున్నారు. అయితే, సొసైటీల్లో సభ్యత్వం ఉన్న రైతులకు మాత్రమే పాలకవర్గాల్లో అవకాశం కల్పించనున్నారు. ఎన్నికల ఖర్చులు, గొడవలు నివారణే లక్ష్యంగా తాజాగా పీఏసీఎస్, డీసీసీబీలను ప్రభుత్వం రద్దు చేసింది.

## ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా నెక్నాంపూర్‌లో 23 ఎకరాలకు ఫెన్సింగ్

మొదటి పేజీ తరువాయి

1975లో ఈ భూమిని పోచయ్య దగ్గర నుంచి కొన్నట్టు మహ్మద్ ఇబ్రహీం తప్పుడు పత్రాలు సృష్టిస్తే 2019లో పాకాల పోచయ్యకు టుంబ సభ్యులు అదే భూమి తమదంటూ పోరాటం మొదలు పెట్టడం కొసమెరుపు.

ఊపిరి పీల్చుకున్న స్థానికులు

వ్యవస్థలను మేనేజ్ చేసుకుంటూ కొట్టే ద్దామని బడాబాబులు చేసిన ప్రయత్నాలకు హైడ్రా చెక్ పెట్టింది. సామాన్యులను ముం దు పెట్టి బడాబాబులు చేసే కబ్జా ప్రయత్నాలకు హైడ్రా భగ్నం చేసింది. అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రాకు స్థానికులు ధన్యవదాలు తెలిపారు. నగర ప్రణాళిక నిబంధనల ప్రకారం.. ప్రణాళికాబద్ధ అభివృద్ధితో పాటు ఓపెన్ స్పేస్, గ్రీన్ జోన్లుగా ఈ స్థలాలను అభివృద్ధి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. హైడ్రా వంటి పటిష్టమైన వ్యవస్థను తీసుకువచ్చిన రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించారు.

అమీన్‌పూర్‌లో పార్కు స్థలానికి ఫెన్సింగ్

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం అమీన్‌పూర్ విలేజ్‌లోని సర్వే నంబర్ 1019, 1020(పి)లో 2.27 ఎకరాల పరిధిలో లేఔట్ వేశారు. 2005లో 24 ప్లాట్లతో అపెక్స్ ప్రాపర్టీస్ వారు ఈ లేఔట్ వేశారు. ఇందులో సగం ల్యాండ్ ఓ నర్‌వి కాగా.. అపెక్స్ డెవలపర్స్‌వి మిగతావి అనే మాదిరి వేసిన లే ఔట్‌లో 672 గజాల మేర పార్కుకు కేటాయించారు. ఇలా కేటాయించిన పార్కు స్థలాన్ని 2013లో ల్యాండ్ ఓనరల్ తన బంధువుకు గిఫ్ట్ డీడ్ చేశారు. దీంతో వివాదం మొదలైంది. దీనిపై ఇండస్ వ్యాలీ–2 నివాసితులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. స్థానిక రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో హైడ్రా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టింది. పార్కు స్థలమే అని నిర్ధారణ అవ్వడంతో ఆక్ర మణలను తొలగించి 672 గజాల పార్కు స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేసి హైడ్రా బోర్డులను ఏర్పాటు చేసింది. దశాబ్ద కాలంగా పార్కు స్థలం కోసం పోరాడుతున్నామని.. హైడ్రా చర్యలతో ఇది సాధ్యమైందని ఇండస్ వ్యాలీ ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ పార్కు స్థలాన్ని డబ్బుల్లో లెక్క కడితే రూ.5 కోట్ల విలువ ఉంటుందని పేర్కొన్నారు.

## దీపు చంద్ర దాస్ హత్యపై ఢిల్లీలో నిరసనలు బంగ్లాదేశ్ హైకమిషన్ ముట్టడికి విహెచ్‌పి యత్నం

బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలపై జరుగుతున్న అమానుష దాడులు, దీపు చంద్ర దాస్ అనే వ్యక్తిని అకారణంగా 'మాబ్ లించింగ్' (మూక దాడి) చేసి చంపడాన్ని నిరసిస్తూ ఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్ సమీపంలో విశ్వహిందూ పరిషత్, ఇతర హిందూ సంఘాలు భారీ నిరసన చేపట్టాయి. బంగ్లాదేశ్‌లో హిందువుల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని, అక్కడి ప్రభుత్వం దాడులను అరికట్టడం లో పూర్తిగా విఫలమైందని ఆందోళనకారులు మండిపడ్డారు. దీపు చంద్ర దాస్ హత్యకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని, హిందూ సమాజానికి భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

ఈ నిరసన కార్యక్రమం సందర్భంగా వీహెచ్‌పీ కార్యకర్తలు బంగ్లాదేశ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఢిల్లీలోని బంగ్లా హైకమిషన్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే పోలీసులు ముందస్తుగానే భారీగా మోహరించి బారికేడ్లతో వారిని అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడుల విషయంలో భారత ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని అంతర్జాతీయ స్థాయిలో ఒత్తిడి తీసుకురావాలని ఈ సందర్భంగా వీహెచ్‌పీ, భజరంగ్ దళ్, ఇతర హిందూ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో అప్రమత్తం అయిన పోలీసులు వారిని చెదరగొట్టేందుకు లాఠీ ఛార్జ్ చేయాల్సి వచ్చింది.

# ఉప సర్పంచ్‌ల అధికారాలకు కత్తెర

## ఎన్నికల అనంతరం 24గంటల్లోనే చెక్ పవర్ రద్దు

## రాష్ట్ర ప్రభుత్వ సంచలన నిర్ణయం




తెలుగు గళం న్యూస్ హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో కొత్త పాలకవర్గం కొలువుదీరి 24 గంటలు కూడా గడవకముందే రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.గ్రామపంచాయత్ ల్లో ఉప సర్పంచ్‌లకు ఉన్న జాయింట్ చెక్ పవర్‌ను రద్దు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.2018 పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం గ్రామాల్లో సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్‌కు సంయుక్తంగా చెక్ పవర్ కల్పించడంతో,ఉప సర్పంచ్ పదవి ఇప్పటివరకు కీలక పాత్ర పోషించింది.గ్రామ అభివృద్ధి పనులు,నిధుల వినియోగంలో ఉప సర్పంచ్‌లకు ప్రాముఖ్యత ఉండేది.అయితే తాజా స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్ ఒక రాజకీయ పార్టీకి,ఉప సర్పంచ్ మరో పార్టీకి చెందినవారు పెద్ద సంఖ్యలో ఎన్నిక కావడంతో పాలనా ప్రక్రియకు ఆటంకాలు ఏర్పడతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది.ఈ నేపథ్యంలోనే గ్రామాభివృద్ధి నిలిచిపోకుండా చూడాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్న ప్రచారం సాగుతోంది.ఈ ఉత్తర్వులతో ఇకపై గ్రామపంచాయతీల్లో ఆర్థిక వ్యవహారాల్లో సర్పంచ్‌కే పూర్తి అధికారం ఉండనుండగా,ఉప సర్పంచ్ పాత్ర పరిమితమయ్యే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# స్టేషన్ ఘనపూర్‌లో రాజకీయ సెగలు

## కడియం శ్రీహరిపై నిప్పులు చెరిగిన తాటికొండ రాజయ్య



తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్ జనగామ జిల్లా రాజకీయాలు మరోసారి వేడెక్కాయి.స్టేషన్ ఘనపూర్ వేదికగా మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య,ప్రస్తుత ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.ఆయన చేసిన ఘాటు వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.

"నకిలీ ఎన్‌కౌంటర్లకు రారాజు": సమావేశంలో మాట్లాడిన రాజయ్య,కడియం శ్రీహరి గత రాజకీయ చరిత్రను ప్రస్తావిస్తూ తీవ్ర ఆరోపణలు చేశారు."కడియం శ్రీహరి నకిలీ ఎన్‌కౌంటర్లకు రారాజు.ఆనాడు దళితులపై అణచివేతకు పాల్పడిన చరిత్ర ఆయనది"అంటూ విమర్శించారు.కార్యకర్తల శ్రమతో గెలిచి,అదే కార్యకర్తలపై కేసులు పెట్టించడం అన్యాయమని నిలదీశారు.

"చిటికెలు వేస్తూ బహిరంగ సవాల్": రాజయ్య సమావేశంలో చిటికెలు వేస్తూ కడియం శ్రీహరికి బహిరంగ సవాల్ విసిరారు."బిఆర్ఎస్ కార్యకర్తల జోలికి వస్తే ఊరుకునేది లేదు.దమ్ము,ధైర్యం ఉంటే రా..నువ్వో నేనో తేల్చుకుందాం"అంటూ హెచ్చరించారు.అరెస్టులు,పోలీసుల నిర్బంధాలకు భయపడబోమని స్పష్టం చేశారు.

"రాజీనామా చేయాల్సిందేనన్న డిమాండ్": కడియం శ్రీహరి వైఖరిపై రాజయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.నైతికత ఎక్కడ?బిఆర్ఎస్ గుర్తుపై గెలిచి కాంగ్రెస్ ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనడం సిగ్గుచేటన్నారు.ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి అని డిమాండ్ చేశారు.గ్రామాల్లో తిరిగితే అడ్డుకుంటాం అని హెచ్చరించారు.స్పీకర్‌కు ఇచ్చిన అఫిడవిట్‌ను "రాజకీయ డ్రామా"గా అభివర్ణించారు.

"తస్మాత్ జాగ్రత్త": హెచ్చరిక"వైఖరి మార్చుకోకపోతే రాజకీయంగా తగిన బుద్ధి చెబుతాం.నీపై బహిష్కరణ వేటు తప్పదు"అంటూ రాజయ్య తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.రాజయ్య వ్యాఖ్యలతో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో రాజకీయ ఉత్కంఠ పెరిగింది.దీనిపై కడియం శ్రీహరి వర్గం నుంచి ఎలాంటి స్పందన వస్తుందో వేచి చూడాల్సి ఉంది.

# విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ: హుజురాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రేగొండ మండలం గాంధీనగర్ ఎంసీజేపీ బాలికల పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 73 మంది విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమం మంగళవారం నిర్వహించగా, ట్రస్ట్ నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్ చేతులమీదుగా,పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ టి.కరుణ సమక్షంలో విద్యార్థినులకు ప్యాడ్లు అందజేశారు.ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ టి.కరుణ మాట్లాడుతూ, తల్లి పేరున మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందించడం అభినందనీయమని అన్నారు.విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు,పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.ట్రస్ట్ నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్ మాట్లాడుతూ,2011 సంవత్సరం నుంచి ప్రభుత్వ రంగంలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందిస్తున్నామని,ఈ విద్యా సంవత్సరంలో సుమారు 10 వేల పరీక్ష ప్యాడ్లను విద్యార్థులకు అందజేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



# మున్సిపల్ ఎన్నికల్లో కమ్యూనిస్టులను ఆదరించండి

## 30 వార్డులలో సిపిఐ ఒంటరిగా పోటీ,డబ్బుకు ఓటును అమ్ముకోకండి

## -సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మోటపలుకుల రమేష్




తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి: ప్రజా సమస్యలపై నిత్యం పోరాడుతూ ప్రజల పక్షాన నిలిచే కమ్యూనిస్టులను రాబోయే జనవరి మున్సిపల్ ఎన్నికల్లో ఆదరించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జిల్లా కార్యవర్గ సభ్యులు మోటపలుకుల రమేష్ ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని రావి నారాయణరెడ్డి భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ, ఇటీవల గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రభుత్వం నిర్వహించిందని,అదే తరహాలో జనవరిలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. భూపాలపల్లి మున్సిపాలిటీలో ఉన్న మొత్తం 30 వార్డుల్లో కాంగ్రెస్, టీఆర్ఎస్ పార్టీలతో ఎలాంటి పొత్తులు లేకుండా సిపిఐ ఒంటరిగా పోటీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. ప్రజాసేవ, అభివృద్ధే లక్ష్యంగా కమ్యూనిస్టు పార్టీ ముందుకు సాగుతుందని అన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రభావం పెరిగిందని విమర్శించిన రమేష్, ఓట్లను కొనుగోలు చేయడానికి లక్షల రూపాయలు ఖర్చు చేసి ప్రజాభివృద్ధికి వినియోగించాల్సిన నిధులను వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగిస్తున్నారని మండిపడ్డారు.డబ్బుకు ఓటును అమ్ముకునే రాజకీయ సంస్కృతికి ప్రజలు చెక్ పెట్టాలని, డబ్బులు అవసరం లేని రాజకీయ వ్యవస్థ రావాల్సిన అవసరం ఉందని అన్నారు.కోల్‌బెల్ట్ ప్రాంతంలో సింగరేణి కార్మికులు ఐక్యంగా ఉండి ప్రజాపక్ష విధానాలకు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.నిజమైన ప్రజాసేవ చేస్తూ అభివృద్ధి కోసం పోరాడే వారికే ప్రజలు అండగా నిలవాలని, నిత్యం ప్రజల తరపున పోరాడే కమ్యూనిస్టులను మున్సిపల్ ఎన్నికల్లో గెలిపించాలని రమేష్ విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి సుధాకర్ రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యులు మాతంగి రామచందర్, సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్, జిల్లా సమితి సభ్యులు క్యాథరాజు సతీష్, నేరెళ్ల జోసెఫ్, వేముల శ్రీకాంత్‌తో పాటు సిపిఐ, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

# రేపాక రైతు వేదికలో 'అన్నదాత ఉత్సవం'

## రైతులు ఆధునిక సాంకేతికతను అవలంబించాలి

## -ఎస్‌బీఐ వరంగల్ రూరల్ ఏజీఎం ఏఎన్‌వీ సుబ్బారావు

## ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా వ్యవసాయ శాఖ మార్కెట్ చైర్మన్ గుటోజు కిష్టయ్య



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ వ్యవసాయంలో పాత పద్ధతులను విడనాడి, కాలానుగుణంగా వస్తున్న ఆధునిక సాంకేతికతను రైతులు స్వీకరించాలని ఎస్‌బీఐ వరంగల్ రూరల్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (ఏజీఎం) ఏఎన్‌వీ సుబ్బారావు సూచించారు.ప్రపంచ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఎస్‌బీఐ ఆధ్వర్యంలో రేపాక రైతు వేదికలో 'అన్నదాత ఉత్సవం' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు డ్రోన్ స్ప్రేయర్లు, హార్వెస్టర్లు, సోలార్ పరికరాలు వంటి ఆధునిక యంత్రాలను వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. పీఎంజీఈపీ పథకం ద్వారా ఈ పరికరాలను సులభంగా పొందవచ్చని,తద్వారా ఖర్చులు తగ్గి లాభాలు పెరుగుతాయని తెలిపారు.రైతుల ఆర్థిక అభివ ృద్ధికి ఎస్‌బీఐ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని, అవసరమైన రుణ సౌకర్యాలు కల్పిస్తున్నామని స్పష్టం చేశారు.రుణాలు తీసుకున్న రైతులు నిరీ?త గడువులోగా చెల్లింపులు చేయడం ద్వారా ప్రభుత్వ సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు.గత పది సంవత్సరాలుగా వ్యవసాయ రుణాలు తీసుకొని సమయానికి రెన్యువల్ చేసుకుంటూ ప్రభుత్వ సబ్సిడీలు పొందుతున్న ఐదుగురు రైతులను బ్యాంకు సిబ్బంది ఈ కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పరకాల ఎస్‌బీఐ ఏసీబీ చీఫ్ మేనేజర్ రవి, డిప్యూటీ మేనేజర్ శ్రీనివాస్, ఫీల్డ్ ఆఫీసర్ నిఖిల్, సీఎస్పీ పాయింట్ నిర్వాహకులు మడప మమత సంపత్ రెడ్డి, భూపాలపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య, గ్రామ సర్పంచ్ గుల్ల స్వప్న తిరుపతి, ఉప సర్పంచ్ వెంగల నర్సయ్య, రిటైర్డ్ ఎంఈఓ పగడాల ఐలయ్య, మాజీ సర్పంచ్ పొనగంటి తిరుపతి తదితరులు పాల్గొన్నారు. రైతులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# భూపాలపల్లిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

## శాంతి, ప్రేమ, సోదరభావానికి క్రిస్మస్ ప్రతీక:ఎమ్మెల్యే జీఎస్సార్




తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి: భూపాలపల్లి పట్టణంలోని మంజూరునగర్ ప్రాంతంలో ఉన్న కల్వరి చర్చిలో రాష్ట్ర ప్రభుత్వం తరపున జిల్లా మైనారిటీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై క్రైస్తవ సోదరసోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, క్రిస్మస్ పండుగ శాంతి, ప్రేమ, కరుణ, త్యాగం వంటి మానవీయ విలువలకు ప్రతీక అని అన్నారు. ఏసుక్రీస్తు బోధనలు సర్వ మానవాళికి మార్గదర్శకమని, పరస్పర సహకారం, సహనం, సోదరభావంతో జీవించడమే క్రిస్మస్ పండుగ యొక్క అసలైన సందేశమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.సమాజంలో ఐక్యత, సమానత్వం, మానవత్వాన్ని పెంపొందించడంలో క్రిస్మస్ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. అన్ని మతాలు మానవత్వాన్నే బోధిస్తాయని, ప్రతి ఒక్కరూ పరస్పరం గౌరవంతో జీవించినప్పుడే సమాజం శాంతియుతంగా అభివ ృద్ధి చెందుతుందని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని, క్రైస్తవుల అభివ ృద్ధికి అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ శాఖ అధికారులు, చర్చి నిర్వాహకులు, క్రైస్తవ సంఘ నాయకులు,విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను ఘనంగా నిర్వహించారు.వేడుకలు ఆనందోత్సాహాలతో, భక్తిశ్రద్ధల మధ్య ముగిశాయి.



# రేగొండ మండలంలో విషాదం

## కరెంట్ షాక్‌కు గురై వృద్ధ రైతు మృతి



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండబీ రేగొండ మండలంలోని ఆర్‌జీ తండాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. మొక్కజొన్న పంటకు నీరు అందించే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురైన వ ృద్ధ రైతు అక్కడికక్కడే మ ృతి చెందాడు. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాద వాతావరణం నెలకొంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, ఆర్‌జీ తండాకు చెందిన అజ్మీర రుప్లా నాయక్ (75) తన వ్యవసాయ పొలంలో మొక్కజొన్న పంటకు నీరు పెట్టేందుకు మోటారు ఆన్ చేస్తున్న సమయంలో అకస్మాత్తుగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు.ప్రమాద తీవ్రత కారణంగా ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు గ్రామస్తులు తెలిపారు.సమాచారం అందుకున్న రేగొండ పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి, ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు.ఈ దురెటనతో మ ృతుని కుటుంబ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. గ్రామంలో శోకసంద్ర వాతావరణం నెలకొనగా,పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు కుటుంబాన్ని పరామర్శిస్తున్నారు. ఈ సందర్భంగా ఆర్‌జీ తండా సర్పంచ్ రవళిక వీరునాయక్ మృతుని కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ కష్ట సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.



# రాష్ట్ర అభివృద్ధికి వెన్నెముక సింగరేణి

## -ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

### సింగరేణి 137వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న భూపాలపల్లి ఎమ్మెల్యే




తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి: రాష్ట్ర అభివృద్ధికి సింగరేణి కాలరీస్ సంస్థ వెన్నెముకలాగా నిలుస్తోందని,బొగ్గు ఉత్పత్తి ద్వారా రాష్ట్రంతో పాటు దేశ ఇంధన అవసరాలను తీర్చడంలో సింగరేణి కీలక పాత్ర పోషిస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. సింగరేణి కాలరీస్ సంస్థ 137వ ఆవిరావే దినోత్సవం సందరరేగా మంగళవారం భూపాలపల్లిలోని సింగరేణి జీఎం కార్యాలయంలో భూపాలపల్లి ఏరియా ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందరరేగా ముందుగా ఎమ్మెల్యేకు సింగరేణి కార్మికులు, ఉద్యోగులు ఘన స్వాగతం పలికారు.అనంతరం జీఎం కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, సింగరేణి జీఎం పూలమాలలు వేసి నివాళు లర్పించారు.తదనంతరం జెండావిష్కరణ చేసి, వేదికపై కేక్ కట్ చేసి ఆవిరావే దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందరరేగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ఆర్థికాభివ ృద్ధికి సింగరేణి సంస్థ కీలక స్థంభంగా నిలుస్తోందని తెలిపారు. కార్మికుల కష్టానికి తగిన గుర్తింపు లభించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. కార్మికుల భద్రత, ఆరోగ్యం, సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.సింగరేణి సంస్థ ఆధునికీకరణ, సాంకేతిక అభివ ృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతూ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.భవిష్యత్తులో కూడా సింగరేణి మరింత ప్రగతి సాధించేలా కార్మికులు,అధికారులు, ఉద్యోగులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.సింగరేణి సంస్థకు సుస్థిర భవిష్యత్తు కల్పించేందుకు ప్రభుత్వం పూర్తి కట్టుబాటుతో ఉందని, సంస్థను అగ్రగామిగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ పునరంకితమవాలని కోరారు.ఈ సందరరేగా ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ఎమ్మెల్యే శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా ముగిశాయి.







# రాంపురం గ్రామ సర్పంచ్ గా పెండ్లి శ్రీనివాస్ రెడ్డి ప్రమాణ స్వీకారం

### గ్రామాభివృద్ధే లక్ష్యంగా ముందడుగు ప్రజాసేవలో కొత్త అధ్యాయం




తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం రాంపురం గ్రామ నూతన సర్పంచ్ గా పెండ్లి శ్రీనివాస్ రెడ్డి అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. గ్రామ స్పెషల్ ఆఫీసర్ యూ శశిధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై పండుగ వాతావరణాన్ని స ృష్టించారు. ప్రజల నమ్మకానికి ప్రతీకగా యువ నాయకుడిగా గ్రామ ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు పొందిన శ్రీనివాస్ రెడ్డి ప్రజల నమ్మకంతో సర్పంచ్ పదవిని దక్కించుకున్నారు. గ్రామాభివ ృద్ధి కోసం ఎప్పుడూ ముందుండే నాయకుడిగా మంచి పేరు ఉంది. ఆయన ప్రమాణ స్వీకారం చేయగానే గ్రామస్తులు గజమాలతో ఘనంగా సన్మానించి శు భాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు పెండ్లి రఘువీర్ రెడ్డి, గ్రామ సీనియర్ నాయకులు రాంపెల్లి వీరంజి గౌడ్, పెండ్లి మహేష్ రెడ్డి, పెండ్లి వెంకట్ రెడ్డి,యల్దీ అశోక్, దిద్ది వీర సోములు, బోర హరీష్, దిద్ది చంద్రశేఖర్, రాంపెల్లి శ్రీను, రంజిత్ గౌడ్, జక్కోజు సురేష్, చింత రమేష్,రాంపురం గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సేంద్రియ వ్యవసాయం వైపు రైతులను ప్రోత్సహించాలి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయానికి ప్రోత్సహం అందిస్తున్నాయి
- ఎక్కువ దిగుబడి వచ్చే వంగడాలను రైతులకు పరిచయం చేయాలి
- రైతులు వ్యవసాయంతో పాటు పాడి పశువులను కూడా పెంచాలి
- పాడి పశువుల వల్ల రైతులకు అదనపు ఆదాయం సమాకూరుతుంది
- సేంద్రియ వ్యవసాయానికి ఉపయోగకరంగా ఉంటుంది
- ఎరువులు,క్రిమిసంహారక మందుల వాడకం తగ్గించాలి
- శాస్త్రవేత్తలు రైతులతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించాలి
- వ్యవసాయ క్షేత్రాలలో పర్యటించినప్పుడే వాస్తావ పరిస్థితుల పై అవగాహన కలుగుతుందిలి
- స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్





తెలుగు గళం న్యూస్ జనగామ: రైతులను సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లించినప్పుడే రైతులకు,ప్రజలకు మేలు జరుగుతుందని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు.రఘునాథపల్లి మండలం నీడిగొండలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం,తెలంగాణ రైతు విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కిసాన్ మేళా కార్యక్రమంలో జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా తో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వ్యవసాయ అనుబంధ కొత్త రకం విత్తనాలు,వ్యవసాయ పనిముట్లు,సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్ లను పరిశీలించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ...పత్తి సాగు,ఉత్పత్తి పెంచడానికి రైతులు,శాస్త్రవేత్తలతో కలిసి ఏర్పాటు చేసిన కిసాన్ మేళాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడానికి ప్రతీ సంవత్సరం ఈ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నప్పటికి ఆశించిన స్థాయిలో మార్పు రావడం లేదని అన్నారు.పత్తిలో అధిక సాంద్రత పాటిస్తే ఎక్కువ దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్న సలహాలను రైతులు పాటించాలని సూచించారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నాయని అన్నారు.వ్యవసాయానికి సంబంధించి సబ్సిడీలు బోనస్లు ఉచిత విద్యుత్ రైతు భరోసా వంటి పథకాలతో ఏడాదిలో ఒక ఎకరానికి 20,000 వరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహం అందిస్తున్నాయని అన్నారు.వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులను సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.ఎక్కువ క్రిమిసంహారక మందులు వాడటం వల్ల భూమి సాంద్రత కోల్పోవడంతో పాటు అనేక రకాల వ్యాధుల బారిన పడుతున్నామని అన్నారు.రైతులు వ్యవసాయంతో పాటు పాడి పశువులను కూడా పెంచాలని పాడీ పశువుల ద్వారా అదనపు ఆదాయం సమకూర్తుందని తెలిపారు.అలాగే సేంద్రియ వ్యవసాయానికి పశువుల పేడ ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు.ఎరువులు క్రిమిసంహారక మందుల వాడకం తగ్గించి సేంద్రియ పద్ధతుల ద్వారా వ్యవసాయం చేయాలని రైతులను కోరారు.వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించాలని అప్పుడే వ్యవసాయం క్షేత్రంలోని వాస్తవ పరిస్థితుల పైన అవగాహన కలుగుతుందని సూచించారు.రైతులు ఒకే పంటను వేయకుండా పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలి తెలిపారు.రైతులు ఎక్కువగా మరి పత్తి మొక్కజొన్న వంటి పంటలనే ఎక్కువగా వేస్తున్నారని అలా కాకుండా ఆకుకూరలు కూరగాయలు చిరుధాన్యాలు వంటి పంటలను కూడా పండించాలని అన్నారు.జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ మాట్లాడుతూ....సేంద్రియ వ్యవసాయానికి రైతులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.ఆ దిశగా వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులను ప్రోత్సహించాలని అన్నారు.పత్తి పంటకు వచ్చే తెగుళ్ల నివారణకు సేంద్రీయ పద్ధతులను అనుసరించే విధంగా రైతులను ప్రోత్సహించాలని సూచించారు.అధిక ఎరువులు క్రిమిసంహారక మందులు వాడటం వలన ఎదురయ్యే ఇబ్బందులను రైతులకు వివరించాలన్నారు.ప్రధాన పంటలతో పాటు రెండో పండగ రాగులు,సజ్జలు జొన్నలు వంటి చిరుధాన్యాలను పండించాలన్నారు.అవసరం మేరకు మాత్రమే యూరియాను ఉపయోగించాలని అధికమవుతాదిలో యూరియాను వాడటం వల్ల భూమి సాంద్రత కోల్పోతుందని తెలిపారు.నానో యూరియాను రైతులు ఉపయోగించాలని సూచించారు.రైతులు అందరూ అధిక విస్తీరంలో ఒకే పంట పండించడం మాని అన్ని రకాల పంటలు పండించాలన్నారు.మార్కెట్ కు అనుగుణంగా పంటలు పండించినట్లయితే రైతులకు పండిన పంట అమ్ముకోవడానికి ఇబ్బందులు ఉండవన్నారు.అధిక సాంద్రత పద్ధతి లో పత్తి పంట సాగుచేయడం వలన అధిక దిగుబడులు పొందే అవకాశం ఉందని...యాసంగి పంట కాలానికి పంట మార్పిడి చేసుకొని ఇతర పంటలు సాగు చేసుకోవాలన్నారు.రైతులు రసాయనిక ఎరువులు వాడకుండా సేంద్రీయ మరియు సహజ సాగు విధానంలో పంటలు పండించాలని కోరారు.రైతులందరూ నూతన సాంకేతిక విధానాన్ని అవలంబించాలని తెలియజేస్తూ ఈ యాసంగి పంట కాలం నుండి యూరియా ఎరువును ఆన్లైన్ యాప్ లో బుక్ చేసుకొని కొనుగోలు చేయాలన్నారు.రైతులందరూ వ్యవసాయ అనుబంధ శాఖల శాస్త్రవేత్తలు,అధికారుల సూచనలు సలహాలు తీసుకొని అధిక దిగుబడులు పొందాలని కోరారు.ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కిసాన్ మేళాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు,విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు శాస్త్రవేత్తలు,రైతులు,తదితరులు పాల్గొన్నారు.





# మాతృ,శిశు మరణాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి -జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



తెలుగు గళం న్యూస్ జనగామ డిసెంబర్ 23 జిల్లా కలెక్టరేట్ (సమన్వయ కార్యాలయాల సముదాయం) లోని మినీ సమావేశ మందిరంలో మంగళవారం శిశు మరణాల సమీక్ష మరియు మాతృ మరణాల సమీక్ష సమావేశం జరిగింది.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా పాల్గొని వైద్య అధికారులతో కలిసి మరణాలకు గల కారణాలపై సుదీరంగా చర్చించారు. రెండు వేల ఇరవై నాలుగు-ఇరవై ఐదు మరియు రెండు వేల ఇరవై ఐదు-ఇరవై ఆరు సంవత్సరాలకు సంబంధించిన కేసులను సమగ్రంగా సమీక్షించిన కలెక్టర్,భవిష్యత్తులో ఇలాంటి మరణాలు పునరావ ృతం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.ప్రతీ గరిణీ మరియు శిశువు ఆరోగ్యం పట్ల మెడికల్ అధికారులు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు.జిల్లావ్యాప్తంగా ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేయాలన్నారు.అధిక ప్రమాదం ఉన్న గరిణీలను (హై రిస్క్ కేసెస్) ముందుగానే గుర్తించి,సంక్లిష్ట పరిస్థితుల్లో ఉన్నవారిని సరైన సమయంలో మెరుగైన ఆసుపత్రులకు పంపాలని సూచించారు.వంద శాతం ప్రసవాలు ఆసుపత్రుల్లోనే జరిగేలా చర్యలు తీసుకోవాలని,గరధారణకు ముందు మరియు ప్రసవం తర్వాత అందించే సేవలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తెలిపారు.అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మందులు,పరికరాలు ఉండాలని,ఇరవై నాలుగు గంటల పాటు సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు.ఆశా కార్యకర్తలు,ఏఎన్ఎంల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని కోరారు.ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు,రిఫరల్ ఆసుపత్రులు మరియు ప్రైవేట్ ఆసుపత్రుల మధ్య సమన్వయం పెరగాలని సూచించారు.నివారించగలిగే మరణాలను అడ్డుకోవడంలో అధికారులు,సిబ్బంది బాధ్యత వహించాలని,తీసుకున్న చర్యలపై ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.?ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.మల్లికార్జున రావు తో పాటు సంబంధిత కమిటీ సభ్యులు మరియు ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

# జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు




తెలుగు గళం న్యూస్ హన్మకొండ: క్రిస్మస్ పండగను పురస్కరించుకొని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో ప్రీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ మేన శ్రీను,డిటిఓ శ్రీనివాస్ కుమార్ పాల్గొని సిబ్బందికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.కుల మతాలకు అతీతంగా ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే పండుగ క్రిస్మస్ అని,మానవత్వం,ప్రేమ,సౌభ్రాతృత్వం వంటి విలువలను ఈ పండుగ గుర్తుచేస్తుందని వారు పేర్కొన్నారు.క్రిస్మస్ యొక్క ప్రాముఖ్యతను సిబ్బందికి వివరించారు.ఈ కార్యక్రమంలో అదనపు డీఆర్డీఓ ఈజీఎస్ సెర్ప్, సూపరిండెంట్లు,డీపీఎంలు,ఏపీఎంలు తదితర అధికారులు,కార్యాలయ సిబ్బంది పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# పవిత్ర మత గ్రంథాలన్నీ పలికిన ఒకే నినాదం శాంతి సందేశం

### యేసుక్రీస్తుపై ముహమ్మద్ ప్రవక్త,మిర్జా గులాం అహ్మద్ బోధనలు-మతాలకతీత ఐక్యతకు బలమైన ఆధారం

## క్రిస్మస్ పర్వదిన సందర్భంగా తెలుగు గళం న్యూస్ ప్రత్యేక కథనం



క్రిస్మస్ పండుగ కేవలం క్రైస్తవ మతానికే పరిమితమైనది కాకుండా,ప్రపంచ మానవాళికి ప్రేమ,కరుణ,శాంతి మార్గాన్ని సూచించే మహత్తర మానవీయ సందరరేగా నిలుస్తోంది.యేసుక్రీస్తు (ఈసా అలైహిస్సలాం) జననం,జీవితం,బోధనలపై బైబిల్,ఖుర్ఆన్‌తో పాటు అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ గ్రంథాలు కూడా ఒకే మానవత్వ దారిని ప్రతిపాదిస్తున్నాయి.ఇస్లాం ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం),అలాగే అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ వ్యవస్థాపకుడు హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ (అలైహిస్సలాం) యేసుక్రీస్తు గురించి ఇచ్చిన సందేశాలు-మతాల మధ్య పరస్పర గౌరవం,సౌభ్రాత ృత్వం,శాంతియుత సహజీవనానికి బలమైన పునాది వేస్తున్నాయి.బైబిల్‌లో యేసు:ప్రేమ,క్షమకు ప్రతిరూపం

బైబిల్ ప్రకారం యేసుక్రీస్తు జననం ఒక దైవ అదుతేం."ఈ రోజు దావీదు పట్టణంలో మీకొరకు ఒక రక్షకుడు పుట్టాడుబీఆయన ప్రభువైన క్రీస్తు"(లూకా 2:11) అని దేవదూతలు ప్రకటించినట్లు కొత్త నిబంధన వివరిస్తుంది.శత్రువులను కూడా ప్రేమించాలి,క్షమించాలి,సేవ చేయాలి అనే బోధలే యేసు సందేశానికి కేంద్రబిందువుగా క్రైస్తవ విశ్వాసం పేర్కొంటుంది.ఖుర్ఆన్‌లో ఈసా (అ)అల్లాహ్ యొక్క గొప్ప ప్రవక్త



ఇస్లాం ధర్మంలో యేసుక్రీస్తును ఈసా అలైహిస్సలాంగా అత్యంత గౌరవిస్తారు.ఖుర్ఆన్ ఆయనను అల్లాహ్ పంపిన గొప్ప ప్రవక్తగా పేర్కొంటుంది.తండ్రి లేకుండానే అల్లాహ్ ఆజ్ఞతో జన్మించిన మహదుతే సంకేతంగా వరి?స్తుంది."నేను అల్లాహ్ యొక్క దాసుడను.ఆయన నాకు గ్రంథాన్ని ఇచ్చాడు,నన్ను ప్రవక్తగా చేశాడు"(సూరా మర్యమ్ 19:30) అనే వాక్యం ద్వారా ఆయన దైవత్వం కాదు,ప్రవక్తత్వమే స్పష్టమవుతుంది.అయినప్పటికీ,మానవాళికి ఆయన ఒక కారుణ్యంగా పంపబడ్డారని ఖుర్ఆన్ స్పష్టం చేస్తుంది.

"మహా ప్రవక్త ముహమ్మద్(స.అ.వ)బోధనలు"

ప్రవక్తలందరూ సహోదరులే

ఇస్లాం చివరి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) యేసుక్రీస్తు గురించి ఇచ్చిన బోధనలు మత సామరస్యానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయి."ఈ లోకంలోనూ,పరలోకంలోనూ మర్యమ్ కుమారుడైన ఈసాకు నేను అత్యంత సమీపుడిని.ప్రవక్తలందరూ సహోదరులేబీవారి మతం ఒక్కటే"(సహీహ్ బుఖారీ,సహీహ్ ముస్లిం)అని ప్రకటిస్తూ,ప్రవక్తలందరూ ఒకే ఏకేశ్వర సందేశాన్ని,నైతిక జీవనాన్ని,మానవ సేవను బోధించారని స్పష్టం చేశారు.అలాగే,"మర్యమ్ కుమారుడైన ఈసాను అతిశయపరచవద్దు.ఆయన అల్లాహ్ యొక్క దాసుడు మరియు ప్రవక్త మాత్రమే"(సహీహ్ బుఖారీ)అని యేసుక్రీస్తుపై గౌరవం,సమతుల్యతతో కూడిన విశ్వాసాన్ని ముహమ్మద్ ప్రవక్త ప్రతిపాదించారు.

"అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ వ్యవస్థాపకులు మిర్జా గులాం అహ్మద్ సందేశం"

యేసు శాంతి ప్రవక్త

అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ వ్యవస్థాపకులు హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ (అలైహిస్సలాం) తన రచనలు,ఉపన్యాసాల్లో యేసుక్రీస్తును శాంతి,సహనం,అహింసకు ప్రతీకగా నిలిచిన ప్రవక్తగా వివరించారు.ఆయన ప్రకారం,యేసు ఖడ్గంతో కాదు-ప్రేమతో,ప్రార్థనతో,నైతిక శక్తితో మానవ హ ృదయాలను జయించారు.మతం పేరుతో హింసకు ఎక్కడా స్థానం లేదని యేసు జీవితం స్పష్టంగా చూపిస్తుందని మిర్జా గులాం అహ్మద్ పేర్కొన్నారు."యేసుక్రీస్తు శత్రువుల కోసం కూడా ప్రార్థించిన ప్రవక్త.ఈ కాలంలో ప్రపంచానికి అత్యంత అవసరమైనది అదే ఆత్మీయ బోధ"అని ఆయన చెప్పారు.అహ్మదీయుల ప్రసిద్ధ నినాదమైన"అందరినీ ప్రేమించు-ఎవరినీ ద్వేషించకు"అనేది యేసు బోధించిన క్షమ,ప్రేమ,మానవ సేవ సిద్ధాంతాల ఆధారంగానే రూపుదిద్దుకుందని,అహ్మదీయులు విశ్వసిస్తున్నారు.క్రిస్మస్-మతాలకతీత మానవీయ పిలుపు

మొత్తంగా పరిశీలిస్తే,యేసుక్రీస్తు గురించి మతాల మధ్య సిద్ధాంత భేదాలు ఉన్నప్పటికీ,ఆయన బోధించిన ప్రేమ,కరుణ,శాంతి సందేశాన్ని బైబిల్,ఖుర్ఆన్,ముహమ్మద్ ప్రవక్త బోధనలు,మిర్జా గులాం అహ్మద్ సందేశాలు సమానంగా ప్రతిపాదిస్తున్నాయి.క్రిస్మస్ పండుగ ఈ మతాలకతీత సత్యాన్ని మానవాళికి గుర్తుచేసే గొప్ప సందరరేగా నిలుస్తోందని మత పండితులు అభిప్రాయపడుతున్నారు.ప్రస్తుత విభజనల కాలంలో,ప్రవక్తలు చూపిన ఈ ప్రేమ-శాంతి మార్గాన్ని ఆచరణలో పెట్టడమే నిజమైన మత,సామరస్యానికి,సామాజిక సౌభ్రాత ృత్వానికి దారి తీస్తుందని వారు స్పష్టం చేస్తున్నారు.

**(ముహమ్మద్ సలీం తెలుగు గళం న్యూస్ తెలంగాణ బ్యూరో రిపోర్టర్)**

# "మీ డబ్బు-మీ హక్కు"

### జనగామలో ప్రత్యేక అవగాహన,క్లెయిమ్ సెటిల్‌మెంట్ శిబిరం



తెలుగు గళం న్యూస్ జనగామ: భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (డీఎఫ్ఎస్),తెలంగాణ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ),తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు,రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) సమన్వయంతో "మీ డబ్బు-మీ హక్కు"అంశంపై ప్రత్యేక అవగాహన,క్లెయిమ్ సెటిల్‌మెంట్ శిబిరాన్ని మంగళవారం జనగాం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు.బ్యాంకులు,బీమా సంస్థల వద్ద పెండింగ్‌లో ఉన్న అనాధరించబడిన డిపాజిట్లు,బీమా మొత్తాలు,ఇతర ఆర్థిక ఆస్తులపై ప్రజలకు అవగాహన కల్పించడం,వాటి క్లెయిమ్ పరిష్కారాన్ని సులభతరం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందరరేగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..బ్యాంక్ డిపాజిట్లు,బీమా క్లెయిమ్‌లు, షేర్లు,డివిడెండ్లు, మ్యూచువల్ ఫండ్లు తదితర అనాధరించబడిన ఆర్థిక ఆస్తులకు సంబంధించి హక్కుదారులు,చట్టబద్ధ వారసులు ఈ ప్రత్యేక శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని అవసరమైన పత్రాలతో సంబంధిత బ్యాంకులు లేదా సంస్థలను సంప్రదించాలని సూచించారు.శిబిరం కాలంలో బ్యాంకు అధికారులు ప్రజలకు పూర్తిస్థాయిలో సహకారం అందించి గరిష్టంగా క్లెయిమ్‌ల పరిష్కారం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.చాలా కాలంగా ఖాతాల్లో లావాదేవీలు లేకపోవడం వల్ల కోట్ల రూపాయల విలువైన నిధులు బ్యాంకులు,బీమా సంస్థల వద్ద అనాధరించబడిన నిధులుగా నిల్వ ఉన్నాయని కలెక్టర్ తెలిపారు.వ్యక్తిగత ఖాతాలతో పాటు ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ఖాతాలు కూడా ఈ కోవలోకి వస్తున్నాయని,సంబంధిత శాఖల అధికారులు బ్యాంకులతో సమన్వయం చేసుకొని త్వరితగతిన పరిష్కారం సాధించాలని సూచించారు.ఈ శిబిరంలో ఎల్ఐసీ సహా పలు బ్యాంకులు,బీమా సంస్థలు ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేసి అనాధరించబడిన డిపాజిట్లు,బీమా క్లెయిమ్‌లపై సమగ్ర సమాచారం అందించాయి.క్లెయిమ్ విధానం,అవసరమైన పత్రాలు,దరఖాస్తు ప్రక్రియలను వివరించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయగా,క్లెయిమ్ దరఖాస్తు ఫారాలు కూడా అందుబాటులో ఉంచారు.ప్రజలు తమ గుర్తింపు పత్రాలు,ఖాతా వివరాలతో కౌంటర్లను సంప్రదిస్తే అవసరమైన సమాచారం సులభంగా పొందవచ్చని అధికారులు తెలిపారు.ఈ సందరరేగా కొంతమంది ఖాతాదారులకు క్లెయిమ్ పరిష్కార పత్రాలను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా యూనియన్ బ్యాంక్ తరపున 32 లక్షల రూపాయలు,వివిధ బ్యాంకుల ద్వారా 28 లక్షల రూపాయలు కలిపి మొత్తం 60 లక్షల రూపాయలు ఇప్పటివరకు సెటిల్ చేసినట్లు లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మూర్తి తెలిపారు.ఈ కార్యక్రమంలో డి.సి.చారి,చీఫ్ మేనేజర్,రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ,హైదరాబాద్‌బీఎస్.గోమతి,అసిస్టెంట్ జనరల్ మేనేజర్,రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాబీఆశాలత,ప్రాంతీయ మేనేజర్,తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌బీశ్రీ మూర్తి,లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్‌బీవివిధ బ్యాంకుల బ్రాంచ్ మేనేజర్లు,ప్రజలు పాల్గొన్నారు.

# రెండో పంటకు పూర్తి స్థాయిలో సాగు నీరు అందించాలి

## -స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



తెలుగు గళం న్యూస్ జనగామ నీటి పారుదల,వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష జిల్లాలో రెండో పంటకు ఒక్క ఎకరం కూడా సాగు నీరు అందక ఎండిపోకూడదని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు.నీటి పారుదల,వ్యవసాయ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ..రైతులకు పూర్తి స్థాయిలో సాగు నీరు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.అందుకు అనుగుణంగా నీటి పారుదల,వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పని చేసి చిట్టచివరి ఆయకట్టు వరకు సాగు నీరు చేరే విధంగా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.అన్ని రిజర్వాయర్ల నుండి వెళ్లే ప్రధాన కాలువలు,పంపిణీ కాలువలలో (డిస్ట్రిబ్యూటరీలు) జంగిల్ క్లియరెన్స్, ఇతర అడ్డంకులు ఉన్నాయా లేదా పరిశీలించి తొలగించాలని,అలాగే రిజర్వాయర్ల వద్ద గేట్లను సక్రమంగా తనిఖీ చేయాలని ఆదేశించారు.ఆన్ అండ్ ఆఫ్ విధానంలో నీటి విడుదల చేపట్టాలని,దానికి అనుగుణంగా వాటర్ పంపింగ్ నిర్వహించి రిజర్వాయర్లలో తగిన నీటి మట్టాలు ఉండేలా చూసుకోవాలని తెలిపారు.రైతులకు యూరియా కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని,యూరియా యాప్ వినియోగంపై రైతులకు మరింత అవగాహన కల్పించాలని సూచించారు.పంట వేసిన రైతులకే యూరియా అందించే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని,రైతులు నానో యూరియా వినియోగించేలా ప్రోత్సహించాలని అన్నారు.పంటకు అవసరమైన మేరకే యూరియా వినియోగించాలని,అధిక మోతాదులో యూరియా వాడటం వల్ల కలిగే దుష్ప్రభావాలను రైతులకు వివరించాలని తెలిపారు.పూర్తి స్థాయిలో సాగు నీరు,రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉంచడమే మన లక్ష్యం అని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు.

**"ప్రతి ఎకరాకు నిర్ణీత కాలంలో సాగు నీరు అందించాలి"-జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

అనంతరం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ..నీటి పారుదల,వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పని చేసి నిర్ణీత కాలంలో ప్రతి ఎకరాకు సాగు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.గ్రామ పంచాయతీ పరిధి,క్లస్టర్ స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తూ యూరియా యాప్‌పై రైతులకు విస్త ృత అవగాహన కల్పించాలని సూచించారు.ఆన్లైన్ విధానంతో పాటు,ప్రతి ఎరువుల దుకాణంలో బుకింగ్ ఐడీ వివరాలతో భౌతిక రిజిస్టర్ తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో నీటి పారుదల శాఖ ప్రధాన ఇంజనీర్,సూపరింటెండింగ్ ఇంజనీర్,డివిజనల్ ఇంజనీర్‌లు,వ్యవసాయ శాఖ అదనపు వ్యవసాయ సంచాలకులు,వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

# సర్వ మానవాళికి యేసుక్రీస్తు బోధనలు అనుసరణీయం

## వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి

## హనుమకొండ కలెక్టరేట్ లో క్రిస్మస్ వేడుకలు



తెలుగు గళం న్యూస్ హనుమకొండ డిసెంబర్ 23 : సర్వ మానవాళికి యేసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు.మంగళవారం హనుమకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.అదేవిధంగా చర్చిల సుందరీకరణ పనులపై సంబంధిత అధికారులు,క్రైస్తవ సంఘాల పెద్దలు,పాస్టర్లతో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో చర్చించారు.ఈ సందర్భంగా మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకొని పేద క్రైస్తవులకు క్రిస్మస్ వేడుకలను ఏర్పాటు చేసేందుకు ప్రతి నియోజకవర్గానికి రెండు లక్షల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయడం జరిగిందని పేర్కొన్నారు.హనుమకొండ జిల్లాలో రెండు నియోజకవర్గాలకు గాను వేడుకల కోసం ఒక్కో నియోజకవర్గానికి రెండు లక్షల చొప్పున 4 లక్షల రూపాయలను,ఒక్కో నియోజకవర్గ పరిధిలోని 50 చర్చిల అలంకరణకు 30 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిచడం జరుగుతుందని ఆమె తెలిపారు.నియోజకవర్గ శాసనసభ్యుల ఆధ్వర్యంలో నియోజకవర్గంలో రెండు అనువైన ప్రాంతంలో విందు ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.జిల్లాలో రూ.4.50 లక్షల గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ నిధులతో 94 చర్చిలలో తాత్కాలిక లైటింగ్ డెకరేషన్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.ప్రభుత్వం అన్ని మతాలకు సమ ప్రాధాన్యతనిస్తూ అన్ని మతాల పండుగలను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుందని తెలిపారు.యేసుక్రీస్తు జన్మదినం సందర్భంగా క్రిస్మస్ పండుగ ప్రపంచంలోని అన్ని ఖండాలలో ఘనంగా జరుగుతుందని,మనుషులలో మానవత్వం నింపి,పాప విముక్తులను చేయడానికి యేసుక్రీస్తు ఈ లోకానికి వచ్చాడని మేయర్ అన్నారు.జిల్లా ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వైవి.గణేష్ మాట్లాడుతూ..సంబంధిత శాఖల అధికారులు ప్రజాప్రతినిధుల సమన్వయంతో క్రిస్మస్ విందు ఏర్పాట్లను పర్యవేక్షించాలని అన్నారు.ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు సమకూర్చుకోవాలని తెలిపారు.ప్రభుత్వం మంజూరు చేసిన చర్చిల సుందరీకరణ నిధులు త్వరితగతిన వారికి అందేలా చర్యలు చేపట్టాలన్నారు.ఈ సందర్భంగా అధికారులు,క్రైస్తవ పెద్దలు,పాస్టర్లతో కలిసి మేయర్ క్రిస్మస్ కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సమావేశంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి గౌస్ హైదర్,హనుమకొండ రెవెన్యూ డివిజనల్ అధికారి రాథోడ్ రమేష్ ,తహశీల్దారు రవీందర్ రెడ్డి, పాస్టర్స్ టిసిఎఫ్ అధ్యక్షులు బిషప్ జాన్ మార్కండేయ,రెవరెండ్ జోసఫ్ ప్రభాకర్,అడ్వైజర్ కె. కురియన్,టిసిఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షులు మంద కుమార్,తదితరులు పాల్గొన్నారు.



# గర్భిణీ మహిళపై దాడి.. నిందితుడికి బహిరంగ ఊరేగింపు

ఏపీ న్యూస్, 23 డిసెంబర్ (తెలుగు గళం న్యూస్): గర్భిణీ మహిళలపై దాడి చేసిన నిందితుడిని పోలీసులు బహిరంగంగా ఊరేగించారు. ఈ ఘటన శ్రీ సత్యసాయి జిల్లాలో చోటు చేసుకుంది. కదిరిలో మాజీ సీఎం వైఎస్ జగన్ పుట్టినరోజు సందర్భంగా వైసీపీ శ్రేణులు టపాకాయలు కాలుస్తూ కేకలు వేస్తూ హంగామా సృష్టించారు. ఈ క్రమంలో సంధ్యారాణి అనే గర్భిణి ఇబ్బంది పడుతూ తమ ఇంటివద్ద టపాకాయలు కాల్చవద్దని చెప్పింది. దీంతో ఆగ్రహించిన వైసీపీ కార్యకర్త అజయ్ దేవా ఆమెపై దాడి చేశాడు. మహిళ కడుపుపై తంతూ రక్తం వచ్చేలా దాడి చేశాడు.

వెంటనే మహిళను కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. అయితే ఈ దారుణానికి పాల్పడిన అజయ్ ని అదుపులోకి తీసుకున్న పోలీసులు వాళ్ల స్టైల్ లో కోటింగ్ ఇచ్చారు. అక్కడితో ఆగకుండా భవిష్యత్ లో ఇలాంటి దాడులు జరగకుండా హెచ్చరిస్తూ కదిరి పట్టణం నడిబొడ్డున అతడిని ఊరేగించారు. మరొకరు ఇలాంటి ఆదులకు పాల్పడకుండా పోలీసులు నిందితుడికి ట్రీట్మెంట్ ఇచ్చినట్టు కనిపిస్తోంది. ఇక మరో నిందితుడు పరారీలో ఉన్నట్టు తెలుస్తోంది. అతడికోసం పోలీసులు గాలిస్తున్నారు.



# వార్షిక జల్సా (సాలానా) ఖాదియాన్ విశిష్టత

- ▶▶జల్సా సాలానా ఖాదియాన్: ఆధ్యాత్మిక చైతన్యానికి విశ్వ వేదిక
- ▶▶వార్షిక జల్సా ఖాదియాన్ - విశ్వాసం, శాంతి, సమైక్యతకు ప్రతీక
- ▶▶ఖాదియాన్ జల్సా సాలానా - ఇస్లామీయ ఆధ్యాత్మిక మహాసమాగమం
- ▶▶జల్సా సాలానా ఖాదియాన్: మతసామరస్యానికి వెలుగురేఖ
- ▶▶జల్సా సాలానా - విశ్వాసులను ఒకచోట చేర్చే పవిత్ర సభ
- ▶▶ఖాదియాన్ జల్సా: ఆధ్యాత్మిక శాంతికి మార్గం
- ▶▶జల్సా సాలానా ఖాదియాన్: శాంతి సందేశానికి కేంద్రబిందువు
- ▶▶దైవ స్మరణకు దారి చూపే జల్సా సాలానా
- ▶▶విశ్వాస వికాసానికి దైవప్రేరిత సమావేశం
- ▶▶ప్రపంచ సహోదరభావానికి జల్సా సాలానా ఖాదియాన్
- ▶▶జల్సా సాలానా:మానవత్వం,శాంతి,సహనం


**ఖాదియాన్ జల్సా సాలానా ప్రత్యేక కథనం తెలుగు గళం న్యూస్ లో**



ఇస్లాంలో ఆధ్యాత్మిక సభలు,సమావేశాలు,(జల్సాలు, ఇజ్తిమాలు) విశేష ప్రాముఖ్యతను కలిగి ఉన్నాయి. ఇవి ముస్లింల ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు ప్రధాన మార్గాలుగా నిలుస్తాయి.ఇస్లాం బోధనల ప్రకారం ఇవి విశ్వాసం (ఇమాన్),కార్యాచరణ (అమల్)ను దృఢ పరుస్తూ,ధార్మిక పరమైన కర్తవ్యాలను గుర్తు చేస్తాయి."జల్సాలు దైవ ప్రసన్నత పొందే మార్గాలు"అని ముస్లింలు భావిస్తారు.ఆధ్యాత్మిక సమావేశాలు అనేవి ముస్లింలలో ధార్మికపరమైన జ్ఞానం,ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయి.ఈ సమావేశాలలో ఖురాన్,హదీస్ బోధనలు వివరించబడడం వలన ఆధ్యాత్మిక ఉన్నతిని పొందుతారు.జల్సా (ధార్మిక సభ)ల్లో మతపరమైన కర్తవ్యాలు,సామాజిక బాధ్యతల వైపు ద ృష్టిని మరల్చుతూ



దైనందిన జీవితంలో ముస్లింలు నిజమైన ఇస్లాం బోధనలను ఎలా అనుసరించాలో నేర్పబడుతుంది.ఖురాన్ లో పలుమార్లు సద్గుణాలు,మంచి సత్కార్యములు చేయడంపై శ్రద్ధ చూపించబడింది.ఇది జల్సా సాలానా ముఖ్య ఉద్దేశాల్ని బలపరుస్తుంది."సామూహికంగా దైవ స్మరణ చేసేవారు ఆనందం పొందుతారని" ప్రవక్త ముహమ్మద్ సల్లం ప్రబోధించారు.జల్సా (ధార్మిక సభ)లు లేదా సాంప్రదాయిక ఆధ్యాత్మిక సమావేశాలు ముస్లింల జీవితాల్లో మానసిక ప్రశాంతతను అందిస్తాయి.ముఖ్యంగా జల్సాల్లో దువా (ప్రార్ధన) మరియు జిక్ర్ (దైవ స్మరణ)కు అధిక ప్రాధాన్యముంటుంది.విశ్వవ్యాప్తంగా ఉన్నటువంటి కమ్యూనిటీ సభ్యులు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా తమ జీవితాలను ఉన్నతంగా మార్చుకోగలుగుతారు.ఆ లక్ష్యంలో భాగంగానే ఇస్లాం వ్యవస్థాపకులు ముహమ్మద్ ప్రవక్త (స)గారి భవిష్యవాణి ప్రకారం ఈ కాలపు వాగ్దాత,మసీహ్ మహ్దీగా అవతరించిన హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ గారు 1891వ సంవత్సరంలో పంజాబ్ రాష్ట్రంలోని గురుదాస్ పూర్ జిల్లా ఖాదియాన్ నగరంలో ఈ వార్షిక జల్సా (సాలానా) ఖాదియాన్ ను ప్రజలను సత్యం,శాంతి మరియు ధార్మికత దిశగా నడిపించడానికి ఈ సమావేశాలకు బీజం వేయడం జరిగింది.నేడు ఈ వార్షిక సమావేశాలు విశ్వవ్యాప్తంగా దాదాపు 220 పైగా దేశాలలో వివిధ తేదీలలో జరుపుకుంటున్నారు.ఈ సంవత్సరం కూడా ప్రస్తుత ఖలీఫా హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ గారి ఆధ్యాత్మిక నేత ృత్వంలో భారతదేశంలో డిసెంబర్ 26,27,28 తేదీలలో జరిగే ఈ వార్షిక జల్సాలో దేశ వ్యాప్తంగా ఉన్న అహ్మదీయులే కాకుండా విదేశాల నుండి కూడా అధిక సంఖ్యలో అహ్మదీయులు ఒకచోట చేరి తమ ధార్మిక జ్ఞానాన్ని,విశ్వాసాన్ని పెంపొందించుకునే ప్రయత్నం చేస్తారు.ఇది భౌతిక భిన్నతల మధ్య ఐక్యతను సూచిస్తుంది.ఈ కార్యక్రమం వ్యక్తిగత,సామూహిక ఆధ్యాత్మికతను పెంపొందించడానికి,విశ్వ సహోదరభావాన్ని మరియు శాంతిని ప్రోత్సహించడానికి ఏర్పాటు చేయబడుతుంది.ఈ కార్యక్రమం కేవలం ధార్మికపరమైన విషయాలకే పరిమితం కాకుండా,వ్యక్తిగత అభివ ృద్ధి,సామాజిక సమైక్యత,మరియు మానవత్వాన్ని మేల్కొలిపేందుకై ఉద్దేశించబడింది.ఈ సమావేశం ఒక చిన్న సమూహంతో ప్రారంభమైనప్పటికీ,నేడు ఇది ప్రపంచవ్యాప్తంగా కొన్ని లక్షల మంది హాజరయ్యే పెద్ద సమావేశంగా మారింది.ఇది ఆధ్యాత్మిక చైతన్యం,సామాజిక చర్చలు,మరియు మతపరమైన బోధనలకు కేంద్ర బిందువుగా ఉంటుంది.హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహి సలాం గారు జల్సా సాలానా ను గురించి ఈ విధంగా తెలియజేశారు."ఈ సభ (జల్సా)ను సాధారణ సభగా చూడకుము...ఈ సభకు పునాది దైవం తన స్వహస్తాలతో వేయడం జరిగిందని తెలుపుతూ ఈ సభలో విశ్వాసం,నమ్మకము మరియు దైవ జ్ఞానం పెంపొందించడానికి అవసరమయ్యే సత్య నిదర్శణములు మరియు (ధార్మిక) పరిజ్ఞానానికి సంబంధించిన విషయాలు తెలుపడం జరుగుతుందని అన్నారు.జల్సా సాలానా వేదిక ద్వారా అనేక మంది విశ్వాసులు,భక్తులు తమ ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించుకోవడమే కాకుండా,తమ జీవితాలను ధార్మిక మార్గాల్లో పునర్నిర్మించుకోవడానికి ప్రేరణ పొందుతూ ఆధ్యాత్మిక అవగాహనను పొందుతారు.అదే విధంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చే వ్యక్తులు ఒకే వేదికపై సమావేశమై సామాజిక సంబంధాలను బలపరుస్తూ,సమైక్యతను చాటుతూ ప్రపంచానికి అహింస,శాంతి సందేశాన్ని పంపగలుగుతారు.ఇది మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుంది.ఇవన్నీ కార్యక్రమాలు జల్సా సాలానా ఖాదియాన్ యొక్క ప్రాముఖ్యతను వివారిస్తాయి.జల్సా సాలానా అనేది కేవలం మతపరమైన కార్యక్రమం మాత్రమే కాదు,ఇది ఒక వ్యక్తి ఆధ్యాత్మికతను,సామాజిక సమైక్యతను,మరియు మానవ సంబంధాలను బలపరిచే వేదిక.ఇది మత పరిమితులను అధిగమించి,ప్రపంచానికి శాంతి,సత్యం,మరియు సహనానికి నిదర్శనంగా నిలుస్తుంది.ఈ విశేషమైన కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా వ్యక్తులు తమ జీవితాలను మరింత ధార్మికంగా,సమాజపరంగా,మరియు మానవతావాద ద ృక్పథంలో చైతన్యవంతం చేసుకోవచ్చు.ఈ (జల్సా) సభ సాదాహరణ ప్రాపంచిక వినోద కార్యక్రమం కాదు.ఇది భక్తి,సమాజ సేవ,మరియు సహచరుల,విశ్వాసుల మధ్య సంబంధాలను బలపరచడానికి ఒక ప్రత్యేకమైన వేదిక అని మరియు ఈ సభలను నిర్వహించడానికి ఏకైక లక్ష్యం దైవ సన్నిధిలో శ్రద్ధగా గడపడం మరియు ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పొంపొందడమేనని హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ గారు తెలిపారు.ఇంకను తమరు (అలైహి సలాం) "ఈ సభ యొక్క ముఖ్య లక్ష్యాలలో ఒక లక్ష్యమేమిటంటే,ప్రతీ ఒక స్వఛమైన (విస్వాసి)కి ప్రత్యక్షంగా



ఆధ్యాత్మిక లాభం పొందే అవకాశం కలగాలి,వారి జ్ఞానం పెరగాలి.మరియు దైవ క ృపా,కటాక్షలతో వారి పరిజ్ఞానం అభివ ృద్ధి చెందాలనీ తెలుపుతూ "ఈ జల్సా ప్రపంచంలో జరిగే సాధారణ సమావేశల వంటిది కాదని,దీనికి కచ్చితమైన ఏర్పాట్లు జరగాలని,దీని నిర్వహణ సత్సంకల్పం,శుభ ఫలితాలపై ఆధారపడి ఉంటుందని,ఇది ప్రాపంచిక వినోదాలలో,ఒక వినోదం కాదని"ఈ ఆధ్యాత్మిక జల్సా యొక్క ఔన్నత్యాన్ని కొనియాడారు.హజ్రత్ మసీహ్ మౌవుద్ అలైహిస్సలాం ఈ సభలో పాల్గొనే వారి ప్రయోజనాలను గురించి తెలుపుతూ ప్రతి ఒక్కరూ తమ ధార్మిక చైతన్యాన్ని పెంచుకోవడంతో పాటు,వారి జీవితాలను మరింత దైవ మార్గంలో పునర్నిర్మించుకోవడానికి ప్రేరణ పొందుతారని,అదేవిధంగా ప్రముఖ మత గురువులు చేసే ప్రేరణాత్మక ఉపన్యాసాలు భక్తులను ఆత్మవిశ్వాసంతో ముందుకు నడిపిస్తాయని తెలుపుతూ,ఈ సమావేశాల ఫలితంగా పరస్పర సహాయ సహకారంతో వ్యక్తులు తమ సామాజిక సంబంధాలను మెరుగుపరుచుకోవడం జరుగుతుందని తెలిపారు.హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ అలైహి సలాం గారు ఈ ఆధ్యాత్మిక జల్సాలో పాల్గొనే వారి గురించి కూడా అనేక దువాలు,ప్రార్థనలు కూడా చేయడం జరిగింది.ఈ పవిత్రమైన ధార్మిక సమావేశంలో పాల్గొనే భాగ్యం ప్రతి ఒక్కరికీ కలుగుగాక! ఆమీన్



(ముహమ్మద్ జావిద్ అహ్మద్ పాషా-అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ ప్రజా సంబంధాల ప్రతినిధి ఆంధ్రప్రదేశ్)

# రహదారి భద్రతపై కడియం శ్రీహరి,కలెక్టర్ రిజ్వాన్ బాషా సమీక్ష

## బ్లాక్ స్పాట్ల వద్ద భద్రత పెంచండి-అధికారులకు ఆదేశం

## జనవరిలో రహదారి భద్రతా ఉత్సవాలు






తెలుగు గళం న్యూస్ జనగామ డిసెంబర్ 23: జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం రోడ్డు భద్రత,సాగునీటి పారుదల,మరియు ఎరువుల యాప్ అంశాలపై స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి,జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు.ముందుగా జాతీయ రహదారుల సంస్థ,రహదారులు మరియు భవనాల శాఖ అధికారులతో రహదారి భద్రతపై చర్చించారు.ఈ సందరరేగా శాసనసభ్యులు కడియం శ్రీహరి మాట్లాడుతూ..జాతీయ రహదారి నూట అరవై మూడు రూపకల్పనలోనూ,నిర్మాణంలోనూ భద్రతా ప్రమాణాలను మెరుగుపరచాలని సూచించారు. ఈ రహదారిపై ప్రమాదాల తీవ్రత ఎక్కువగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

సమావేశంలోని ముఖ్యాంశాలు: "ప్రమాదాల నివారణ"-సూర్యాపేట-జనగామ రోడ్డులోని పైవంతెన వద్ద వాహనాలు వెనక్కి తిరిగే (యూ-టర్న్) సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని,దీనికి పరిష్కారంగా పైవంతెనకి ఇరువైపులా రోడ్డు వెడల్పు చేయాలని ఆదేశించారు.

"పాదచారుల భద్రత"-జనగామ నుండి కరుణాపురం వరకు పాదచారుల పైవంతెనల నిర్మాణం, గ్రామాలకు ఆనుకుని ఉన్న అనుబంధ రహదారుల పనులను వెంటనే పూర్తి చేయాలని తెలిపారు.

"వెలుతురు సౌకర్యం"-రఘునాథపల్లి,స్టేషన్ ఘనపూర్,నిడిగొండ,చాగల్,చిన్నపెండ్యాల వద్ద వీధి దీపాలు వెలగకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని,క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ...రోడ్లపై అనధికారికంగా వాహనాలు నిలిపేవారిపై,నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.మసక వెలుతురు ఉన్న చోట్ల లైట్లు,వేగ నియంత్రక పట్టీలు (రంబుల్ స్ట్రిప్స్),మరియు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని జాతీయ రహదారుల సంస్థ అధికారులకు సూచించారు.

"నిబంధనల అమలు"-అధిక బరువుతో ప్రయాణించే వాహనాలపై చర్యలు తీసుకోవాలని, టోల్ గేట్ల వద్ద అడ్డుగా ఉన్న వాహనాలను తొలగించాలని తెలిపారు.ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం (హెల్మెట్) ధరించేలా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

"అవగాహన కార్యక్రమాలు"-రెండు వేల ఇరవై ఆరు జనవరి నెలలో 'రహదారి భద్రతా ఉత్సవాలు' నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్ణయించారు.

ఈ సమావేశంలో పోలీస్,రవాణా,విద్యుత్,పంచాయతీ రాజ్ శాఖల అధికారులు, పురపాలక కమిషనర్లు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అనుకున్న సమయానికి మేడారం పనులన్నీ పూర్తి చేస్తాం

**తాత్కాలిక పనులు కాకుండా శ్వాశత పనులను చేపట్టాం**

**200 సంవత్సరాలు చెక్కుచెదరకుండా అమ్మవార్ల పునరుద్ధరణ పనులు**

**ఆదివాసి గిరిజనుల మనోభావాలు దెబ్బతినకుండానే పనులు పూర్తి**

**రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**



తెలుగు గళం న్యూస్ ములుగు: మేడారం జాతర సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పనులు రెండు వందల సంవత్సరాల కాలం పాటు చెక్కుచెదరకుండా ఉండేలా పనులు చేస్తున్నామని,అనుకున్న సమయానికి అన్ని పనులు పూర్తి చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.మొక్కిన మొక్కులు తీర్చే తల్లులను దర్శించుకోవడానికి మన రాష్ట్రం నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి లక్షలాదిమంది భక్తులు మేడారం చేరుకొని అమ్మవార్ల దీవెనలు పొందుతున్నారని తెలిపారు.మంగళవారం రాష్ట్రమంత్రి ధనుసరి అనసూయ సీతక్క,ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్ రెడ్డి,మహబూబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్,జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.,ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్,ఐటిడిఏ పిఓ చిత్ర మిశ్రా,డిఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్ తో కలిసి మేడారంలో శ్రీ సమ్మక్క సారలమ్మ ఆలయ అభివృద్ధి పనులను,సాండ్ స్టోన్ బొమ్మల లిపి చిత్రాలను,క్యూ లైన్ నిర్మాణ పనులను,గోవిందరాజు పగిడిద్దరాజుల గద్దెల నిర్మాణ పనులను,ఆలయ ఫ్లోరింగ్ పనులను ,ఆలయ ప్రహరీలో వెదురు బొంగు మాదిరిగా ఉన్న స్తంభాలను,మేడారంలో చిలుకలగుట్ట రోడ్డు,స్తూపం,కన్నెపల్లి,జంపన్నవాగు,ఆర్.టి.సి.బస్ స్టేషన్ వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు.అనంతరం మేడారంలోని హరిత హోటల్ లో సంబంధిత శాఖల ఉన్నత స్థాయి అధికారులతో,గుత్తేదారులతో మేడారం జాతర అభివృద్ధి పనుల పురోగతి కూలంకశంగా సమీక్షించి దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర సమీపిస్తున్న నేపథ్యంలో ఆలయ ప్రాంగణ పనులు,రాత్రి నిర్మాణ పనులు,సివిల్ వర్క్స్,గద్దెల చుట్టూ గ్రిల్స్,ప్రాకారం బయటి వైపు సీసీ రోడ్లను పనులు డిసెంబర్ 31వ తేదీ లోపు,ఇతర పనులు జనవరి 5వ తేదీ లోపు పూర్తి పూర్తిచేయాలని సంబంధిత అధికారులను గుత్తేదారులను ఆదేశించారు.ప్రధాన ద్వారం పనులు కూడా జనవరి 5వ తేదీ లోపు పూర్తిచేయాలని అధికారులు చిత్తశుద్ధితో సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఆలయ ప్రాంగణం గద్దెల పరిసర ప్రాంతాలతో పాటు ఇతర ప్రాంతాలలో కూడా త్వరితగతిన లైటింగ్ పనులను పూర్తి చేయాలని రహదారికి ఇరువైపులా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని ,గద్దెలకు చేరుకునే హరిత వై జంక్షన్ నుంచి గద్దెల ప్రాంగణం వరకు సెంట్రల్ లైటింగ్ పనులను కూడా పూర్తి చేయాలని పేర్కొన్నారు.జాతర సమయంలో త్రాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శాశ్వత ప్రతిపాదికన వాటర్ ట్యాంకులను నిర్మించాలని అధికారులు పనులను విభజన చేసుకొని సకాలంలో నిర్దేశించిన గడువులోపు పూర్తి ఆదేశించారు.జాతరకు వచ్చే అన్ని రహదారుల నిర్మాణం పూర్తి చేయాలని,ఐటిడిఏ ఆద్వర్యంలో తాత్కాలిక పనులకు ప్రాధాన్యత ఇవ్వకుండా,శాశ్వత అభివృద్ధి పనులకే ప్రాధాన్యతకి ఇవ్వాలని,సుందరీకరణ కూడలిలో గ్రాస్ ప్లాంటేషన్ పనులు,రహదారికి ఇరువైపులా రెవెన్యూ ప్లాంటేషన్ మొక్కలను నాటించాలని అన్నారు.దేశవ్యాప్తంగా కోట్లాదిమంది భక్తులు వచ్చే జాతర కు సంబంధించిన కార్యక్రమాలు ప్రభుత్వం బ్రహ్మాండంగా నిర్వహిస్తుందని గతంలో కంటే కూడా 200 శాతం భక్తుల సంఖ్య ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది అన్నారు.అధికారులు పట్టుదలతో 31వ తేదీ లోపు పనులను పూర్తి చేయాలని,భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపద్యం లో పోలీస్ శాఖ ఆర్ అండ్ బి అధికారులు సమన్వయం లో పని చేయాలని,వన దేవతల ఆశీసుల తో పనులు సాఫీగా సాగుతున్నాయని మంత్రి అనసూయ సీతక్క అన్నారు.గత జాతర అనుభవాలను దృష్టిలో ఉంచుకొని జాతరను విజయవంతం చేయాలని ఎంపీ బలరాం నాయక్ అన్నారు.అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గిరిజన సాంప్రదాయాలు,సంస్కృతి ఉట్టిపడే విధంగా గద్దెల ప్రాంతంలో పాలరాతి శిల్పాలచే పునరుద్ధరణ పనులు చురుకుగా కొనసాగుతున్నాయని,తక్కువ సమయంలో 100 శాతం పని చేయాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నామని వివరించారు.చిన్న చిన్న అవాంతరాలు కలుగుతున్నప్పటి వచ్చే సంవత్సరం జనవరి 5 వ తేదీ లోగా పనులు పూర్తి అవుతాయని ధీమా వ్యక్తం చేశారు.రానున్న మేడారం మహా జాతరను పురస్కరించుకొని ముఖ్యమంత్రి తో పాటు ఉప ముఖ్యమంత్రి,సహచర మంత్రులు,ప్రతిపక్ష నాయకులను ఆహ్వానిస్తున్నామని,అమ్మవార్ల దీవెనలు ప్రతి ఒక్కరిపై,దేశంపై ఉండాలని అన్నారు.అమ్మవార్లను దర్శించుకోవడానికి వచ్చే భక్తులను దేవాలయ ప్రాంగణ పునరుద్ధరణ పనులు ఎంతగానో ఆకట్టుకోనున్నాయని,నిస్వార్ధంగా దైవ కార్యక్రమాలను పూర్తి చేస్తున్నామని తెలిపారు.గద్దెల ప్రాంతాలలో విశాలమైన ప్రదేశాన్ని ఏర్పాటు చేయడంతో రోడ్డు విస్తరణ పనులు చురుకుగా కొనసాగుతున్నాయని,భక్తులకు ఇబ్బందులు కలగకుండా 29 ఎకరాల భూసేకరణ చేపట్టి పనులు పూర్తి చేస్తున్నామని వివరించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ..ఆదివాసీ గిరిజనుల అస్తిత్వాన్ని కాపాడుతూ పనులను చేపట్టామని,పాలరాతి శిల్పాలు ఇతర ప్రాంతాల నుండి తీసుకు రావడం కారణంగానే ఆలయ పునరుద్ధరణ పనులు కొంత ఆలస్యంగా జరుగుతున్నాయని తెలిపారు.పాలరాతి శిల్పాలపై గిరిజన సాంప్రదాయాలు ఉట్టిపడే విధంగా రూపొందిస్తున్నామని,అమ్మవార్ల దయతో సకాలంలో పనులు పూర్తి అవుతాయని అభిప్రాయపడ్డారు.రాబోయే తరాల వారికి అమ్మవార్ల చరిత్రలు తెలిసే విధంగా శిల్పాలను ఏర్పాటు చేస్తున్నామని,స్వస్తిక్ ఏర్పాటు విషయంలో గిరిజనుల సాంప్రదాయ ప్రకారంగా ఏర్పాటు చేస్తున్నామని దీనిపై ఎవరు రాద్ధాంతం చేయవద్దని కోరారు.పకృతి దైవాలుగా భావించి సమ్మక్క,సారలమ్మ,పగిడిద్దరాజు,గోవిందరాజు ల గొట్టు,గోత్రాల ప్రకారం పనులు చేస్తున్నామని,తామంతా ఒక టీంగా పనిచేస్తూ జాతరను విజయవంతం చేయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు.మహా జాతరను పురస్కరించుకొని ప్రతి గడప గడప నుండి భక్తులు వచ్చి అమ్మవార్ల దీవెనలు పొందాలని కోరుతూ,జాతర విశిష్టతపై పాత్రికేయులు సైతం ప్రచారం చేయాలని కోరారు.ఈ సందర్భంగా ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ మహా జాతరను పురస్కరించుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి కోట్లాది రూపాయలతో పనులు చేపట్టడం అర్భించదగ్గ విషయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు (రెవెన్యూ) సి హెచ్ మహేందర్ జి,(స్థానిక సంస్థలు) సంపత్ రావు,గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్,మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి,ఆర్ అండ్ బి,పి ఆర్ ఈ ఎన్ సి,ఆర్డీఓ వెంకటేష్,పూజారులు,జిల్లా అధికారులు, ఆర్కిటెక్చర్, గుత్తేదారులు, సంబంధిత శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు ఉపాధి హామీని హరించే కుట్రలో భాగమే కేంద్ర నూతన చట్టం

**'వికసిత్ భారత్' పేరుతో నియంతృత్వ దోపిడి చట్టాలు**

**మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి**

**ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్**

**విబిజి రామ్‌జి పథకాన్ని రద్దు చేయాలంటూ**

**ఎంసిపిఐ(యు),సిపిఐ,సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నిరసన-చట్ట ప్రతుల దగ్ధం**



తెలుగు గళం న్యూస్ వరంగల్: గ్రామీణ పేదలకు చట్టబద్ధంగా ఉన్న ఉపాధి హక్కును తీసివేసే కుట్రలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం 'వికసిత్ భారత్ రోజుగార్ అజీవిక మిషన్ గ్రామీణ్ (విబిజి రామ్‌జి)'అనే నూతన చట్టాన్ని తీసుకొచ్చిందని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ తీవ్రంగా విమర్శించారు.ఈ చట్టాన్ని తక్షణమే రద్దు చేసి,మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్ఆర్ఈజీఏ)ను కొనసాగించాలని డిమాండ్ చేశారు.లేకపోతే దారిద్ర రేఖకు దిగువనున్న పేదలకు తీవ్రమైన నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు.ఈ మేరకు వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లో ఎంసిపిఐ(యు),సిపిఐ,సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పిలుపు మేరకు నిరసన కార్యక్రమం నిర్వహించారు.ప్లకార్డులు ధరించి కేంద్ర ప్రభుత్వ నూతన చట్టాన్ని రద్దు చేయాలని నినాదాలు చేస్తూ చట్ట ప్రతులను దగ్ధం చేశారు.ఈ సందర్భంగా జరిగిన నిరసన సభలో ఎంసిపిఐ(యు) నగర కార్యదర్శి మాలోత్ సాగర్ అధ్యక్షత వహించారు.సభలో మాట్లాడిన పెద్దారపు



రమేష్,సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ గ్రేటర్ కార్యదర్శి రాచర్ల బాలరాజు,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్‌లు మాట్లాడుతూ..రాజ్యాంగంలోని 41వ అధికరణ ప్రకారం ఉపాధి హక్కుకు అనుగుణంగా 2005లో కమ్యూనిస్టుల పోరాటాల ఫలితంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలులోకి వచ్చిందని గుర్తు చేశారు.గత 20 సంవత్సరాలుగా దేశవ్యాప్తంగా గ్రామీణ పేదలు,కూలీలు ఈ చట్టం ద్వారా ఉపాధి పొందుతూ జీవనోపాధి సాగిస్తున్నారని తెలిపారు.ఇలాంటి పరిస్థితుల్లో 100 రోజుల పనిదినాల గ్యారెంటీని 200 రోజులకు పెంచి,పెరిగిన ధరలకు అనుగుణంగా దినసరి కూలీని సవరించాలని డిమాండ్ చేస్తుంటే-ఉన్న చట్టాన్ని నిర్వీర్యం చేసేలా 'విబిజి రామ్‌జి' పేరుతో అనేక ఆంక్షలు విధిస్తూ కొత్త చట్టాన్ని తీసుకురావడం రాజ్యాంగ ఉల్లంఘనకేనని ఆరోపించారు.కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ చట్టాన్ని రద్దు చేసి,ఎంజీఎన్ఆర్ఈజీఏను మరింత బలోపేతం చేయాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి.నిరసన కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# క్రైస్తవం అంటే జీవన విధానం నేర్పే మార్గం

**క్రైస్తవులు దయా హృదయం కలిగి ప్రేమను పంచాలి**

**రాష్ట్రంలో ప్రభుత్వం అన్ని మతాలకు సమ ప్రాధాన్యత కల్పిస్తుంది**

**అన్ని మతాలను గౌరవించుకోవడం మంచి సాప్రదాయం**

**మత సామరస్యాన్ని కాపాడటానికి,మత విద్వేషాలను తగ్గించడానికి ఉపయోగపడుతుంది**

**ఎన్ని కష్టాలు పడైనా పిల్లలను బాగా చదివించాలి**

**ఏ సమస్యను అయినా పరిష్కరించగలిగేది చదువు ఒక్కటే**

**పిల్లలను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచాలి**

**ఆ దిశగా పాస్టర్స్ సందేశాలు ఇవ్వాలి**



తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్: క్రైస్తవం అంటే మతం కంటే ఎక్కువ అని,బ్రతుకు మార్గాన్ని నిర్దేశించిదే క్రిస్టియానిటీ అని మాజీ ఉప ముఖ్యమంత్రి,స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం కడియం శ్రీహరి తెలిపారు.స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని కే.ఆర్ గార్డెన్స్ లో క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని క్రైస్తవ సోదరులకు ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న క్రిస్మస్ విందు




కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా అధికారులు,పాస్టర్స్ తో కలిసి కేక్ కట్ చేసి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.....గత కొన్ని సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవించాలననే ఆలోచనలతో అన్ని మతాల పండగలను రాష్ట్ర పండుగలుగా గుర్తించి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అందులో భాగంగానే క్రిస్మస్ పండుగ సందర్భంగా క్రైస్తవ సోదరులకు విందు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.తెలంగాణ రాష్ట్రంలోనే ఇదొక చక్కటి సాంప్రదాయం అని,బతుకమ్మ,క్రిస్మస్,రంజాన్ పండుగ ఈ మూడు పండుగలను కూడా రాష్ట్ర పండుగలుగా గుర్తించి ఆయా మతాలను గౌరవించడం,ప్రభుత్వమే అధికారికంగా పండుగలు నిర్వహించడం చాలా గొప్ప విషయం అని తెలిపారు.ఈ సాంప్రదాయం మతసామరస్యాన్ని కాపాడడానికి,మతాల మధ్యన విద్వేషాలను తగ్గించడానికి బాగా ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. కొన్ని పండుగలు కొన్ని ప్రాంతాలకు,దేశాలకే పరిమితం అవుతాయాని కానీ క్రిస్మస్ పండుగ మాత్రమే ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలలో చాలా గొప్పగా జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు.క్రైస్తవం అంటే మతం కంటే ఎక్కువ అని అది జీవన విధానాన్ని నేర్పే ఒక మార్గం అని తెలిపారు.ఏసు ప్రేమను పంచండి,శాంతిని నెలకొల్పాలనే సందేశం ఇచ్చారని దాన్ని ప్రతీ ఒక్కరు పాటించాలని సూచించారు.ప్రేమను పంచే ప్రయత్నం చేయాలి,దయా గుణాన్ని కలిగి ఉండాలి,తప్పులు చేసిన వాళ్లను క్షమించే గుణం ఉండాలి,పది మందికి సహాయపడే ఓర్పు,నేర్పు కూడా ఉండాలని సూచించారు.అంతేకాదు తప్పు చేయకుండా జాగ్రత్తగా ఉండాలని అన్నారు.పాస్టర్స్ ప్రార్థనా మందిరానికి వచ్చే తల్లిదండ్రులతో ఎన్ని కష్టాలున్న ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పిల్లలను బాగా చదివించే విధంగా సందేశం ఇవ్వాలని తెలిపారు.సమాజంలో ఉన్న అన్ని సమస్యలను పరిష్కరించడానికి విద్య ఒక్కటే మార్గం అని అన్నారు.విద్య ద్వారా మంచి గుర్తింపు,ఉపాధి దొరుకుతుందని తెలిపారు.పిల్లలు,యువకులు మత్తు పదార్థాలకు,మద్యపానానికి దూరంగా ఉండే విధంగా పాస్టర్స్ చూడాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డివో వెంకన్న,నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల తహసీల్దార్లు,ఎంపీడివోలు,పాస్టర్స్,క్రిస్టియన్ మత పెద్దలు,క్రిస్టియన్ సోదర సోదరిమనులు తదితరులు పాల్గొన్నారు.



# సంతానం కలగలేదని పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య..



ఏపీ న్యూస్, 23 డిసెంబర్ (తెలుగు గళం న్యూస్): సంతానం కలగలేదనే తీవ్ర మనస్థాపంతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. బూర్గంపాడు మండల పరిధిలోని కృష్ణసాగర్ గ్రామ పంచాయతీకి చెందిన వలస ఆదివాసీ గ్రామం బట్టిగూడెంలో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. ఘటన వివరాల్లోకి వెళ్తే.. బట్టిగూడెం గ్రామానికి చెందిన సోడి బీమా (36) అనే వ్యక్తికి పదేళ్ల క్రితం నందమ్మతో వివాహమైంది. వీరిద్దరూ గ్రామంలో పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే, వివాహం జరిగి పదేళ్లు గడుస్తున్నా సంతానం కలగకపోవడంతో బీమా గత కొంతకాలంగా తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో గత నెల 30న ఇంట్లో ఎవరూ లేని సమయంలో బీమా పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

పని ముగించుకుని ఇంటికి వచ్చిన భార్య నందమ్మ, అపస్మారక స్థితిలో ఉన్న భర్తను చూసి ఖంగుతింది. స్థానికుల సహాయంతో తక్షణమే అతడిని భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. భద్రాచలంలో పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం ఈనెల 15న కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ మృత్యువుతో పోరాడుతూ.. మంగళవారం బీమా తుదిశ్వాస విడిచాడు. సంతానం లేకపోవడమే తన భర్త ఆత్మహత్యకు కారణమని భార్య పోలీసులకు తెలిపింది. మృతుడి భార్య నందమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బూర్గంపాడు ఎస్ఐ మేడా ప్రసాద్ కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనతో బట్టిగూడెం గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

# సినిమా న్యూస్

## నాకు సంబంధించిన ప్రతి విషయాన్ని ఆయనతో చెప్పి నిర్ణయం తీసుకుంటా: మమిత బైజు



మలయాళ తార మమితాబైజు 'ప్రేమలు' సినిమాతో ఇండస్ట్రీకి వచ్చి అతి తక్కువ సమయంలోనూ ఫుల్ ఫేమ్ రాబట్టుకుంది. ఈ ముద్దుగుమ్మకు సోషల్ మీడియాలో ఫ్యాన్స్ ఫాలోయింగ్ కూడా మామూలుగా లేదు. క్రేజ్‌తో పాటు వరుస అవకాశాలు కూడా వస్తున్నాయి. కోలీవుడ్, టాలీవుడ్, మాలీవుడ్ అంటూ తేడా లేకుండా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ తన పాపులారిటీని పెంచుకుంటోంది. అయితే ఈ అమ్మడుకి క్రేజ్‌తో పాటు లవ్ ప్రపోజల్స్ కూడా అదే రేంజ్‌లో వస్తున్నాయట.

తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మమిత బైజు ఈ విషయాలపై స్పందించి క్లారిటీ ఇచ్చింది. "ప్రేమలు సినిమా హిట్ అయినప్పటి నుంచి లవ్ ప్రపోజల్స్ రావడం బాగా ఎక్కువయ్యాయి. కొందరైతే నా ఫోన్ నంబర్ కనుక్కుని మరీ మెసేజ్‌లు చేస్తున్నారు. నాకు మాత్రం వాటిని చదవడానికి టైమ్ కానీ, ఇంట్రెస్ట్ కానీ లేదు. అందుకే ఆ బాధ్యలన్నీ నేను మా అన్నయ్య మిథున్‌కు ఇచ్చాను. అతను స్టేట్ లెవెల్ క్రికెట్ ప్లేయర్.. మా మధ్య అన్నాచెల్లెళ్ల రిలేషన్ కంటే ఫ్రెండ్‌షిప్ ఎక్కువ. అందుకే నాకు వచ్చే మెసేజ్‌లు అన్ని మా అన్నయ్య చూసి వాటిని తగినట్లుగా రిప్లై ఇస్తాడు. సోషల్ మీడియాలో వచ్చే కామెంట్లకు కూడా తాను కౌంటర్లు వేస్తాడు.

నేను నా జీవితంలో ఏ నిర్ణయం తీసుకోవాలన్నా అన్నయ్యను అడగకుండా డిసైడ్ అవ్వను. ప్రతి విషయంలో మిథున్ ఇన్వాల్వ్‌మెంట్ ఉంటుంది. చివరకు నా పెళ్లి ఎవరితో జరగాలి? ఎప్పుడు జరగాలి అనేది కూడా మా అన్నయ్యే ఫిక్స్ చేస్తాడు. అతను ఎవరిని చేసుకోమంటే అతన్ని చేసుకుంటాను" అని తన అన్నయ్యపై తనకున్న నమ్మకాన్ని ఈ విధంగా చెప్పుకొచ్చింది. దీంతో ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో ఈ విషయం తెలుసుకున్న నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు.



## సీఐడీ ఆఫీస్‌లో మంచు లక్ష్మి బెట్టింగ్ యాప్స్ కేసులో విచారణ!

సినీ నటి మంచు లక్ష్మి బుధవారం ఉదయం హైదరాబాద్‌లోని సీఐడీ కార్యాలయానికి హాజరయ్యారు. లక్డీకపూల్‌లోని ఆఫీసులో అధికారులు ఆమెను ప్రశ్నిస్తున్నారు. నిషేధిత బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేసిన వ్యవహారంలో ఈ విచారణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఆ యాప్‌ల ప్రచారం కోసం ఆమె ఎంత పారితోషికం తీసుకున్నారు? కమీషన్ల రూపంలో ఎంత వెనకేశారు? అనే విషయాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. నిజానికి ఈ బెట్టింగ్ యాప్స్ కేసు ఈనాటిది కాదు. గతంలో ఇదే వ్యవహారంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడి) కూడా మంచు లక్ష్మిని విచారించింది. కేవలం మంచు లక్ష్మి మాత్రమే కాకుండా, గతంలో ఇదే కేసులో విజయ్ దేవరకొండ, రానా దగ్గుబాటి, ప్రకాష్ రాజ్ వంటి స్టార్ హీరోలు కూడా విచారణకు హాజరయ్యారు.

## రెబల్ సాబ్ రెడీ.. ప్రీ రిలీజ్ ఈవెంట్ డేట్, ప్లేస్ ఫిక్స్?




ప్రభాస్ నటించిన రాజాసాబ్ మూవీ రిలీజ్‌కు రెడీ అవుతోంది. మారుతి డైరెక్ట్ చేసిన ఈ సినిమా జనవరి 9న విడుదల కానుంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి ఒక ట్రైలర్, రెండు సాంగ్స్ రిలీజ్ అయ్యాయి. ట్రైలర్‌కు మంచి రెస్పాన్స్ రాగా.. రెండు పాటలు కూడా చార్ట్ బస్టర్ అయ్యాయి. ఇక సినిమా రిలీజ్ టైం దగ్గర పడుతుండడంతో ప్రమోషన్స్ స్పీడప్ చేశారు మేకర్స్. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో భారీ ఎత్తున ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహణకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ఈ ఈవెంట్‌కు ప్రభాస్ వస్తాడని కన్ఫామ్ చేశారు మేకర్స్. ఇక ఇప్పుడు ఈవెంట్ డేట్ ఆల్మోస్ట్ ఫిక్స్ అయినట్టుగా తెలుస్తోంది. డిసెంబర్ 27న ఈవెంట్ నిర్వహణకు ప్లాన్ చేస్తున్నారు. అయితే, వెన్యూ ఇంకా ఫిక్స్ కాలేదు. కానీ, హైదరాబాద్ రామోజీ ఫిలిం సిటీలో ఈ ఈవెంట్ ఉండే ఛాన్స్ ఉంది. రేపో మాపో మేకర్స్ నుంచి ఈ విషయంలో అధికారిక ప్రకటన రానుంది. ఇక ఈ ఈవెంట్‌లో మరొక ట్రైలర్ విడుదల చేయబోతున్నారు. ఇప్పటికే అందుకు సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలుస్తుంది. గతంలో వచ్చిన ట్రైలర్‌లో డార్లింగ్ వింటేజ్ వైబ్‌తో ఫ్యాన్స్ ఖుషీ అయ్యారు. ఇప్పుడు సెకండ్ ట్రైలర్ సినిమా పై మరింత అంచనాలు పెంచేలా కట్ చేస్తున్నట్టుగా టాక్. ఇక్కడితో సినిమా హైప్ నెక్స్ట్ లెవల్‌కి వెళ్లేలా మారుతి ప్లాన్ చేస్తున్నాడు. ఇక ఈ సినిమాలో ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తుండగా.. తమన్ సంగీతం అందిస్తున్నాడు. మరి సంక్రాంతికి రాజాసాబ్ రచ్చ ఎలా ఉంటుందో చూడాలి.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.